

కన్నుల పండువగా కోటి దీపోత్సవం

- మహాచక్రపీఠం శివాలయం వద్ద భక్తుల సందడి
- లాంఛనంగా ప్రారంభించిన మాజీ స్పీకర్ మధుసూదనాచారి

దైవారాధన ఉన్నచోట ప్రశాంతత ఉంటుందని, మానసిక ప్రశాంతత సంతృప్తి, సంతోషాలను కలగజేస్తుందని శాసనసభ మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. ఖమ్మంలోని ఎంబీ గార్డెన్స్ ప్రాంతంలో గల మహాచక్రపీఠం శివాలయం వద్ద సోమవారం రాత్రి కోటి దీపోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. -ఆంధ్రజ్యోతి, ఖమ్మం సాంస్కృతికం

6



కోటి దీపోత్సవాన్ని ప్రారంభిస్తున్న మధుసూదనాచారి



ప్రభుత్వ పథకాలను వివరిస్తూ నృత్యం చేస్తున్న కళాకారులు

ప్రజా రంజకంగా ఏడాది పాలన

- సంక్షేమ పథకాలు విజయవంతంగా అమలు
- సంగీత, నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య
- ఆకట్టుకున్న 50మంది కళాకారుల ప్రదర్శన



మధిర టౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం ఏడాది ప్రజాపాలన ప్రజా రంజకంగా సాగిందని తెలంగాణ సంగీత, నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాల పేర్కొన్నారు. సోమవారం మధిరలోని వర్తక సంఘ కల్యాణ మండపంలో జరిగిన ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏడాదిగా ఎన్నో జనరంజకమైన పథకాలను ప్రభుత్వం అమలుచేసి చూపిందని. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన వారం రోజుల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆరోగ్యశ్రీ పథకాన్ని పది లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకుందన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందించడమే కాకుండా రూ.500లకు గ్యాస్ సిలిండర్ ఇస్తుందని, రైతు రుణాలు మాఫీ చేసిందని అన్నారు. రాష్ట్రంలో మహిళా విశ్వ విద్యాలయాన్ని, క్రీడా విశ్వవిద్యాలయాన్ని నూతనంగా నెలకొల్పడమే కాకుండా అన్ని యూనివర్సిటీలకు ఉప కులపతులను నియమించిందని అన్నారు.

స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పి.శ్రీజ మాట్లాడుతూ ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు జిల్లాలో రెండు రోజుల పాటు ఖమ్మం, పాలేరు నియోజకవర్గాలలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్‌పర్సన్ మొండితోక లత, డీఆర్‌డీవో పీడీ సన్యాసయ్య, జిల్లా సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ సత్యనారాయణ, గిరిజన సంక్షేమ అధికారి విజయలక్ష్మీ, మునిసిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు పలువురు ప్రజాప్రతినిదులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఏడాది విజయాలను కళ్లకు కడుతూ 50 మంది కళాకారులతో నిర్వహించిన ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. హైదరాబాద్ నుంచి ప్రత్యేకంగా వచ్చిన కళాకారులు ఈ ప్రదర్శనలో పాల్గొన్నారు.


నేడు, రేపు ప్రజాపాలన విజయోత్సవాలు 6

భర్త వాగ్వాదం.. భార్య ఆత్మహత్య

తల్లాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాలధారులకు భిక్ష విషయంలో భార్యభర్తల మధ్య వాగ్వాదం జరగడంతో మనస్తాపం చెందిన భార్య పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన సోమవారం ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మల్సూర్‌తండాలో జరిగింది. నాగరాజు, లక్ష్మి(24) దంపతులు మల్సూర్‌తండాలో నివసిస్తున్నారు. కూలి పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. అయ్యప్ప మాలధారులకు భిక్ష పెట్టే విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో మనస్తాపం చెందిన లక్ష్మి పురుగులమందు తాగింది. అపస్మారక స్థితికి వెళ్లిన ఆమెను కుటుంబ సభ్యులు కల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. లక్ష్మి తండ్రి బోడ శ్రీను ఫిర్యాదు మేరకు తల్లాడ ఎస్‌ఐ బి.కొండల్‌రావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. నాగరాజు దంపతులకు ఇద్దరు కుమారులు వున్నారు.

పోడు భూముల్లో ఆయిల్‌పామ్ సాగు

పామాయిల్ గెలల ధర రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును మరింతగా విస్తరించడంపై ఉద్యానశాఖ దృష్టి సారించింది. ఈ క్రమంలో పోడు భూముల్లో ఆయిల్‌పామ్ సాగును విస్తరించాలని భావిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోనే అత్యధికంగా ఉమ్మడి జిల్లాలో గిరిజనులకు పోడు పట్టాలు పంపిణీ చేశారు. లక్షకు పైగా ఎకరాల్లో పోడు రైతులకు హక్కు పత్రాలు అందించారు. ఈ భూముల్లో దశలవారీగా ఆయిల్‌పామ్ సాగును విస్తరిస్తే గిరిజన రైతులకు శాశ్వత ఆదాయంతో పాటు పోడుభూములు మళ్లీ అడవుల మాదిరి అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది. బహుళ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో ఉద్యానశాఖ మండలస్థాయి అధికారులు పోడుభూముల్లో ఆయిల్‌పామ్ సాగుకు గల అవకాశాలపై సర్వే నిర్వహిస్తున్నారు. సాగునీటి అవకాశాలున్న చోట గిరిజన రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించి సాగును పెంచబోతున్నారు.



- ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో సర్వే
- ఐటీడీఏ ద్వారా గిరివికాస పథకం అనుసంధానం
- పలు ప్రోత్సాహకాలు అందించేందుకు చర్యలు
- జిల్లాలో భారీగా పెరగనున్న తోటల విస్తీర్ణం

ఖమ్మం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వాస్తవానికి పోడు భూములకు పట్టాలు ఇచ్చే సమయంలోనే ఆయా భూముల్లో వాణిజ్య పంటలు కాకుండా అటవీ అనుబంధ పంటలు సాగుచేయాలని గిరిజన రైతులకు అధికారులు తెలిపారు. కానీ ఇందుకు భిన్నంగా జామాయిల్, సుబాబుల్‌తోపాటు కొన్నిచోట్ల పత్తి, మిర్చి వంటి వాణిజ్య పంటలు సాగుచేస్తున్నారు. కొంతమంది గిరిజన రైతుల పోడుభూముల్లో గిరిజనేతరులు కౌలుకు తీసుకుని వేల ఎకరాల్లో జామాయిల్ తోటలు వేశారు. దీంతో ప్రభుత్వ లక్ష్యం పక్కదారి పడుతోంది. ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని పట్టాలు ఇచ్చిన పోడుభూముల్లో ఆయిల్‌పామ్ సాగు చేయించడంపై ఉమ్మడి జిల్లా ఉద్యానవనశాఖ అధికారులు దృష్టిసారించారు. ఐటీడీఏ సహకారంతో గిరిజన ప్రాంతాల్లోనూ ఆయిల్‌పామ్ సాగు మరింతగా పెరగనుంది.

మంత్రి తుమ్మల చొరవ...

స్వతహాగా ఆయిల్‌పామ్ రైతు అయిన వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ఉమ్మడి జిల్లాతోపాటు రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగు ఏటికేడు విస్తరిస్తోంది. రాష్ట్రంలో ఆయిల్‌పామ్ సాగులో ఉమ్మడి ఖమ్మం జిల్లా రాష్ట్రంలోనే ముందువరుసలో ఉంది. ఈ నేపథ్యంలో పోడుభూముల్లోనూ ఆయిల్‌పామ్ సాగు చేపడితే దేశంలోనే ఆయిల్‌పామ్ సాగులో ఉమ్మడి జిల్లా మొదటి స్థానంలో నిలవనుంది. మంత్రి తుమ్మల ఇప్పటికే అధికారులకు నిర్దిష్ట లక్ష్యాలను ఇచ్చి తోటల విస్తీర్ణం పెంచేందుకు కృషి చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే దమ్మపేట, అశ్వారావుపేటలో పామాయిల్ పరిశ్రమలు ఉండగా కొత్తగా కొణిజర్ల, వేంసూరు మండలాల్లో పరిశ్రమలు రాబోతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా పరిశ్రమలకు అవసరమైన దిగుబడులు పెంచేందుకోసం పోడుభూముల్లో తోటల పెంపకానికి కార్యాచరణ సిద్ధమవుతోంది.

గిరివికాస పథకంతో అనుసంధానం..

పోడు భూముల్లో ఆయిల్‌పామ్ సాగును పెంచేందుకు ముందుగా నీటి వనరులున్న భూములను (మిగతా 6వ పేజీలో)

కన్నపేగుకు వెల

- రూ.1.20లక్షలకు బిడ్డను బేరం కుదుర్చుకున్న తల్లి
- ఖమ్మంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఘటన

ఖమ్మం క్రైం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కడుపున పుట్టిన బిడ్డను పుట్టిన 12రోజులకే ఓ తల్లి విక్రయానికి ప్రయత్నించింది. ఆమెతో పాటు ఆమె సోదరి కూడా పాప విక్రయానికి బేరం ఆడి సహకరించింది. తీరా డబ్బు విషయంలో తేడా రావడంతో బిడ్డను విక్రయిస్తున్నారని ఐసీడీఎస్ అధికారులకు సదరు సోదరి ఫిర్యాదు చేసింది. ఖమ్మం నగరంలో ఇటీవల జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కల్లూరు మండలం పుల్లయ్యబంజర్ గ్రామానికి చెందిన రుక్మిణికి ఇటీవలే (మిగతా 6వ పేజీలో)



నైపుణ్య పరికరాలతో చెన్నూరు ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం సుధాకర్

విద్యాబోధనలో ప్రయోగాలు

చెన్నూరు ప్రాథమిక పాఠశాలకు ఉత్తమ బెస్ట్ ప్రాక్టీసెస్ అవార్డు

కల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కల్లూరు మండలం చెన్నూరులోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల రాష్ట్రస్థాయిలో ఉత్తమ బెస్ట్ ప్రాక్టీసెస్ పాఠశాలగా ఎంపికైంది. ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దంతాల సుధాకర్ విద్యాబోధనలో నూతన పద్ధతులను అవలంభించడమే కాకుండా,వాటిని వీడియో రూపంలో అందరికీ అందుబాటులోకి తెచ్చారు. అలాగే కూడిక యంత్రం, ఎఫ్ఎల్ఎన్, ఆల్ ఇన్ వన్, టీఎల్ఎమ్, స్థాన విలువలు, సెంటెన్స్ మేకర్, సంఖ్య, రేఖపై చతుర్విధ ప్రకియలు, ఎఫ్ఎల్ఎన్ గేమ్స్ తయారు చేసి విద్యార్థులకు వినియోగంలోకి తీసుకోవచ్చారు. ఈ నేపథ్యంలో ఎస్ఈఆర్‌టి వారు 2024- 2025 కు గాను విద్యార్థులకు విద్యబోధనలో ఉత్తమ నైపుణ్యాల పాఠశాలగా రాష్ట్ర స్థాయిలో ఎంపిక చేశారు.

నగరంలో త్వరలో డ్వాక్రా బజార్

- మహిళలు తయారు చేసిన వస్తువులను నేరుగా అమ్ముకోవాలి
- జిల్లాలో తయారయ్యే ఉత్పత్తులకు 'మేడ్ ఇన్ ఖమ్మం' బ్రాండ్
- ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి పెట్టాలి
- మహిళలతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాటామంతీ

6



భద్రాద్రి జిల్లా అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

- కొత్తగూడెం నుంచి హైదరాబాద్‌కు మరో జాతీయ రహదారి
- ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాం
- త్వరితగతిన భద్రాచలానికి రైల్వేలైన్ నిర్మాణమయ్యేలా కృషి
- కొత్తగూడెం రింగ్‌రోడ్‌కు రూ.400 కోట్లు
- పాల్వంచకు మరో బైపాస్‌రోడ్ మంజూరు
- కొత్తగూడెం, పాల్వంచ పట్టణాలను కలుపుతూ మునిసిపల్ కార్పొరేషన్
- ఆయిల్‌పామ్ అభివృద్ధికి గరిమెళ్లపాడులో సంస్థ
- రాష్ట్రంలో 600 గ్రంథాలయాల పునరుద్ధరణ
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- కొత్తగూడెంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు



చుంచుపల్లి మండలంలో బీటీ రోడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల

కొత్తగూడెం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే భద్రాద్రి కొత్తగూడెం జిల్లాను అభివృద్ధిపరంగా, ఆదర్శంగా నిలపడమే కాకుండా ధనిక జిల్లాగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యమని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. భద్రాద్రిజిల్లా చుంచుపల్లి మండలంలోని నందాతండా నుంచి వికలాంగుల కాలనీ వరకు బీటీ రోడ్ పనులకు సోమవారం మంత్రి తుమ్మల శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.1.50 కోట్లతో కొత్తగూడెంలో నిర్మించిన గ్రంథాలయ నూతన భవనాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి వెంట కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, భద్రాచలం (మిగతా 6వ పేజీలో)



బహుళ అంతస్థుల భవనం సీజ్

- నిబంధనలకు విరుద్ధంగా నిర్మించడంతో కేఎంసీ కొరడా

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పాత భవనంపై బహుళ అంతస్థులు నిర్మాణం చేయటంతో ఖమ్మంనగరంలోని వైరా రోడ్డులో బహుళ అంతస్థుల భవనం సీజ్ చేయటం నగరంలో చర్చనీయాంశంగా మారింది. ఖమ్మం 43వ డివిజన్ పరిధిలో వైరా రోడ్డులో 1979లో సాధారణ భవనం అనుమతి పొంది నిర్మాణం చేశారు. తర్వాత ఆ ప్రాంతంలో కమర్షియల్ వ్యాపారం పెరగటం, ప్రైవేట్ హాస్పటల్స్‌లు చుట్టూ వ్యాపించటంతో దశల వారీగా భవనం అంతస్తులు పెంచుతూ షాపింగ్ కాంప్లెక్స్‌తో కూడిన భవనం నిర్మాణం జరిగింది. పాత భవనంపై నాలుగు అంతస్థులు నిర్మాణం చేయటంతో సమీప ప్రాంత భవనాల ప్రజలు ఆందోళనకు గురయ్యారు. భవనం అంతస్థులు పెంచిన ప్రతిసారి కేఎంసీ అధికారులకు ఫిర్యాదులు చేస్తూనే ఉన్నారు. అయినా ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు స్పందించలేదు. దీంతో బహుళ అంతస్థుల భవనం నిర్మాణం పూర్తి జరిగిన తర్వాత ఫిర్యాదుల వెల్లువ పెరగటంతో సోమవారం ఖమ్మం నగర పాలక సంస్థ పట్టణ ప్రణాళిక అధికారులు భవనాన్ని సీజ్ చేశారు.

నకిలీ బంగారంతో రుణ దందా

- సహకార బ్యాంకు పరిధిలోనే రూ.30 లక్షల వరకు టెండర్
- ఇతర బ్యాంకుల్లోనూ రుణాలు పొందిన మోసగాళ్లు
- గిరిజనుల పేరుతో అకౌంట్లు తెరిచి కొల్లగొట్టిన వైనం
- 15 మంది సభ్యుల ముఠా మాయాజాలం
- పోలీసుల సహకారంతో రికవరీకి బ్యాంకుల చర్యలు
- అప్రయిజర్ల పాత్రపైనా అనుమానాలు



ఖమ్మం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): బ్యాంకుల్లో నకిలీ బంగారం తాకట్టు పెట్టి రుణాలు తీసుకున్న దందాపై డొంక కదులుతోంది. ఈ మోసంపై ఆయా బ్యాంకులు అంతర్గత విచారణ సాగిస్తున్నాయి. ఇప్పటివరకు ఒక్క సహకార బ్యాంకు పరిధిలోనే రూ.30లక్షల వరకు నకిలీ బంగారంతో రుణాలు పొందినట్టు ప్రాథమికంగా తేలింది. తీసుకున్న వారినుంచి రుణాల రికవరీకి డీసీసీబీ చర్యలు చేపట్టింది. మిగిలిన బ్యాంకుల్లో కూడా ఓ ముఠా గిరిజనుల పేరుతో అకౌంట్లు తెరిచి వారి పేరుమీద బంగారం తాకట్టుపెట్టి రుణాలు పొందినట్టు సమాచారం. ఖమ్మం నగరంలోని 5 సహకార బ్యాంకు బ్రాంచీలతోపాటు ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకు చెందిన ఒక బ్రాంచీలో కూడా నకిలీ బంగారంతో కొందరు రుణాలు పొందారు.

గుంటూరు కేంద్రంగా...

గుంటూరు కేంద్రంగా చేతి కడియాలు, బ్రాస్‌లెట్లు, పలురకాల బంగారు ఆభరణాలను చేయించారు. ఈ ఆభరణాలపైన బంగారం కోటింగ్ ఏర్పాటుచేసి బ్యాంకుల్లో గోల్డ్‌లోన్ల కింద రుణాలు తీసుకున్నారు. ఖమ్మం అర్బన్, ఖమ్మం రూరల్ మండలాలకు చెందిన 15 మంది ముఠాగా ఏర్పడి ఆధార్ కార్డులు పెట్టి రుణాలు తీసుకున్నారు. ప్రస్తుతానికి కో ఆపరేటివ్ బ్యాంకులతో పాటు ఏపీజీవీబీ బ్యాంకులకు సంబంధించి నకిలీ బంగారు రుణాలు తీసుకున్నట్టు వెలుగుచూడగా, (మిగతా 6వ పేజీలో)



జేఎన్టీయూ కాలేజీ ఉన్నట్టా.. లేనట్టా?

- మౌలిక సౌకర్యాల కొరతతో వెళ్లిపోతున్న విద్యార్థులు
- ఏడాది దాటినా కదలని భవన నిర్మాణ మంజూరు ఫైల్
- ఇంజనీరింగ్ బ్రాంచ్‌లలో గణనీయంగా తగ్గిన ప్రవేశాలు

7

కల్తీపై కదలికేది?

- కదలని మొబైల్ కల్తీ స్పాట్ టెస్టింగ్ వాహనం
- ఏడాదికి కేవలం 18 కేసులు నమోదు
- ఉమ్మడి ఖమ్మం, నల్గొండ జిల్లాలకు కేంద్ర ప్రభుత్వం వాహనం కేటాయింపు
- డీజిల్ బిల్లులు ఇవ్వటంలేదని సాకు
- వాహన డ్రైవర్‌ను సొంత కారుకు వాడుకుంటున్న అధికారి

6

ఉప్పు, పప్పు, కారం, పసుపు, పాలు, పెరుగు ఆహార పదార్థాల నుంచి నిత్యావసరాల వరకు కల్తీకి కాదేది అనర్హం అనే రీతిలో కల్తీ వ్యాపారం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో జోరుగా సాగుతోంది. కల్తీ ఆహారపదార్థాల కారణంగా సమాజంలో కేన్సర్ రోగుల సంఖ్య ఆందోళనకరస్థాయిలో పెరుగుతోంది. అయితే కల్తీని నివారించేందుకు ఆహార నాణ్యతా ప్రమాణాలశాఖ ఆధ్వర్యంలో అధికారులు కల్తీ పదార్థాలు శ్యాంపిల్స్ సేకరించి వాటిని హైదరాబాద్‌కు పంపి అక్కడి నుంచి తిరిగి కల్తీ ఫలితాలు వచ్చే వరకు నెలలు గడిచేవి. ఈ లోపుగా కల్తీ వ్యాపారులు సర్దుబాటు చేసుకునే వారని విమర్శలు వెలువడుతున్నాయి.

కల్తీపై కదలికేది?



ఆంధ్రజ్యోతి పరిశీలన

- కదలని మొబైల్ కల్తీ స్పాట్ టెస్టింగ్ వాహనం
- ఏడాదికి కేవలం 18 కేసులు నమోదు
- ఉమ్మడిఖమ్మం, నల్గొండ జిల్లాలకు కేంద్ర ప్రభుత్వం వాహనం కేటాయింపు
- డీజిల్ బిల్లులు ఇవ్వటంలేదని సాకు
- వాహన డ్రైవర్‌ను సొంత కారుకు వాడుకుంటున్న అధికారి

ఖమ్మం సంక్షేమ విభాగం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కారం, ఇతర నిత్యావసర వస్తువుల కల్తీలో రాష్ట్రంలోనే ఉమ్మడి ఖమ్మం, నల్గొండ జిల్లాలు ముందు వరసలో ఉండటంతో వామపక్షాల ఆధ్వర్యంలో కల్తీని అరికట్టాలని ఉద్యమాలు చేసిన సంఘటనలు జిల్లాలో ఉన్నాయి. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి ఖమ్మం, ఉమ్మడి నల్గొండ జిల్లాకు స్పాట్ కల్తీ టెస్టింగ్ మొబైల్ వాహనాన్ని కేటాయించి ఖమ్మం గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్ కేంద్రంగా వాహన నిర్వహణ, పర్యవేక్షణకు కేటాయించారు. అయితే కేంద్ర ప్రభుత్వం వాహనాన్ని మంజూరు చేసిన తర్వాత దాని నిర్వహణ, డీజిల్ బిల్లులు రాకపోవటంతో ఏడాదిగా వాహనాన్ని వినియోగించటం లేదు. కలెక్టర్ కార్యాలయంలో పార్కింగ్ ప్రాంతంలో ఉంచారు. దీంతో వాహనంలోని విలువైన పరికరాలు ధ్వంసమయ్యాయి.

రూ.కోటితో మైక్రో బయాలజీ ల్యాబ్ మొబైల్ వాహనం

ఉప్పు, పప్పు, కారం వంటి నిత్యావసరాలతో పాటుగా బిర్యాని, పాలతో పాటుగా ఎటువంటి కల్తీ పదార్థాలనైనా తక్షణం పరీక్షలు నిర్వహించి నిగ్గు తేల్చేందుకు రూ.కోటితో కేంద్ర ప్రభుత్వం మైక్రో బయాలజీ ల్యాబ్ యూనిట్ మొబైల్ వాహ నం ఏర్పాటు చేశారు. వాహనంలో స్పాట్ కల్తీ టెస్టింగ్ ల్యాబ్‌తో పాటుగా వ్యాపారులకు తక్షణ సేవలు అందించేందుకు స్పాట్ వ్యాపార రిజిస్ట్రేషన్, స్పాట్ లైసెన్సింగ్ మంజూరుకు కావాల్సిన పరికరాలు, కల్తీ పరీక్షల సందర్భంగా గ్రామాలు, ప్రాంతాలకు వెళ్లిన సమయంలో ప్రజలకు కల్తీపై అవగాహన కల్పించేందుకు ప్రొజెక్టర్లు, పిక్చర్ వాల్స్ సైతం మొబైల్ వాహనంలో ఏర్పాటు చేశారు. మొబైల్ వాహనంలో జనరేటర్, శ్యాంపిల్స్ చెడి పోకుండా ఆధునిక పరికరాలు, ఏసీలను సైతం ఏర్పాటు చేశారు.

కార్యాలయానికే పరిమితమవుతున్న ల్యాబ్‌టెక్నిషియన్

మైక్రో బయాలజీ స్పాట్ టెస్టింగ్ మొబైల్ వాహనం నిర్వహణలో డ్రైవర్‌తోపాటుగా ల్యాబ్ టెక్నిషియన్‌ను ప్రభుత్వం కేటాయించింది. వైద్యశాఖ నుంచి ల్యాబ్ టెక్నిషియన్‌ను నియమించగా వాహనం పర్యటించకపోవటంతో రోజు ఆహార తనిఖీ కార్యాలయానికి వచ్చి వెను దిరుగుతున్నారు. ఇక వాహనం నడింపేందుకు కేటాయించిన డ్రైవర్‌ను అధికారులు సొంతకారుకు వాడుకుంటున్నారనే విమర్శలు వెలువడుతున్నాయి.

అడ్డుకట్టపడని కల్తీ మాఫియా

కారం, అల్లం, పసుపు, పప్పుల కల్తీలో ఖమ్మంజిల్లా అగ్రగామిగా ఉంది. మిరప తొడిమలతో కల్తీ కారం, ఇతర పదార్థాలతో అల్లం పేస్టును, పసుపు, పప్పులను ఖమ్మం నుంచి ఇతర ప్రాంతాలకు అక్రమ రవాణా జరుగుతోంది. హైదరాబాద్ వంటి మహానగరాల్లో ఆహార తనిఖీ అధికారులు దాడులు చేసి కల్తీ పదార్థాలు స్వాధీనం చేసుకొని విచారణ చేపడితే వాటి మూలాలు ఖమ్మంలోనే ఉన్నట్టు వెల్లడైతుంది. ఏడాది క్రితమే ఆహార తనిఖీ వాహనాన్ని ఉమ్మడి ఖమ్మం, నల్గొండ జిల్లాలకు అందించినా.. లక్ష్యం నెరవేరకపోగాగా దుర్వినియోగం జరుగుతుందని విమర్శలు వెలువడుతున్నాయి.

ఏడాదిలో 18 కేసులకే పరిమితం

ఆహారతనిఖీ శాఖ నిబంధనల మేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నెలకు 20శాంపిల్స్ సేకరించాలి. ఈ మేరకు తనిఖీలు చేపట్టాలి. కానీ గతేడాది కేవలం 18 కేసులు మాత్రమే నమోదయ్యాయి. వాటిలో 14కేసులు ఇప్పటికే జేసీ కోర్టుకు చేరాయి. మరో నాలుగు కేసులు విచారణ స్థాయి ఉన్నాయి. నమోదైన కేసులు పాలు 2, పెరుగు 4, అల్లం పేస్ట్ 1, బెల్లం 3, కారం 2, బిర్యానీలు 1, చికెన్ 1, చికెన్ వింగ్స్ 1, ఇతర పదార్థాలు 3 కేసులు నమోదు జరిగాయి.

నమోదు కాని స్పాట్ టెస్టింగ్ కేసులు

ఆహార కల్తీపై ఆరోపణలు వచ్చిన ప్రాంతానికి స్పాట్ టెస్టింగ్ వాహనాన్ని పంపి, స్పాట్‌లోనే ఆహారపదార్థాలు తనిఖీలు నిర్వహించాల్సి ఉంటుంది. వాహనంలో ఉన్న బయోటెక్నాలజీ పరికారలతో స్పాట్‌లోనే కల్తీ పరిశీలన చేసి కల్తీ తెలితే స్పాట్ జరిమానా విధించాల్సి ఉంటుంది. కాని స్పాట్ టెస్టింగ్ కేసులు నమోదు కాకపోవటం వాహనం పనితీరును తెలియజేస్తోంది.

తనిఖీలు నిరంతర ప్రక్రియ

కిరణ్‌కుమార్, గెజిటెడ్ ఫుడ్ ఇన్‌స్పెక్టర్

ఆహార తనిఖీలు నిరంతర ప్రక్రియ. రాష్ట్రంలోనే ఎక్కువ కేసులు ఖమ్మంజిల్లాలోనే నమోదయ్యాయి. ఈ ఏడాది 14కేసులు నమోదు చేశాం. మరో 4కేసులు శాంపిల్స్ ఫలితాలు రావాల్సి ఉంది. వాహన నిర్వహణ ఇబ్బందులు ఉండటంతో అవసరాల మేరకు వినియోగిస్తున్నాం. ఇతర జిల్లాలకు పంపుతున్నాం.



వైరాకు ఇంటిగ్రేటెడ్ స్కూల్ మంజూరు

- జీవో నెం.223 విడుదల
- 20.08 ఎకరాల స్థల గుర్తింపు...
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నివర్గాల ప్రజలు

వైరా, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రెండో విడతలో నియోజకవర్గ కేంద్రమైన వైరాకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్(వైఐఐఆర్ఎస్) ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైరా మండలానికి చెందిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చొరవ, స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ కృషితో రెండో విడతలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ మంజూరైంది. రాష్ట్రంలో రెండో పేజ్‌లో 26 ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ మంజూరు కాగా వాటిలో వైరా స్కూల్ ఒకటి.

వైరా నడిబొడ్డున ఇంటిగ్రేటెడ్ స్కూల్

వైరాలోని టీజీఆర్ఎస్, టీజీఎస్ డబ్ల్యూఆర్ఎస్‌ల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను నిర్మించనున్నారు. వైరా నడిబొడ్డున ఇప్పటికే 1200మంది విద్యార్థినులతో ఈ రెండు గురుకులాలు 40సంవత్సరాల నుంచి కొనసాగుతున్నాయి. ఇప్పుడు ఈ రెండు గురుకులాల్లో ఉన్న ఖాళీ స్థలాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ను నిర్మించనున్నారు.

20.08 ఎకరాల స్థల గుర్తింపు...

వైరాలో వైఐఐఆర్ఎస్ 20.08 ఎకరాల స్థలాన్ని గుర్తించారు. టీజీఆర్ఎస్‌లో ఖాళీగా ఉన్న 6.32ఎకరాల స్థలాన్ని, అలాగే టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్‌లో ఖాళీగా ఉన్న 13.16ఎకరాల స్థలాలను ఇంటిగ్రేటెడ్ స్కూల్ కోసం ప్రభుత్వానికి జిల్లా కలెక్టర్ ప్రతిపాదనలు పంపించారు. అయితే ప్రస్తుతం టీజీఆర్ఎస్ గురుకులం ఉన్న 1.03 ఎకరాలు, అలాగే టీజీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ భవనాలు ఉన్న మూడెకరాలు స్థలాన్ని కూడా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పరిధిలోకి తీసుకున్నట్లయితే దాదాపు 24 ఎకరాలకుపైగా స్థలం ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి అందుబాటులో ఉంటుంది. వాస్తవానికి ఫేజ్ 2లోని ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణానికి ఈనెల 14వ తేదీనే శంకుస్థాపన చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించినప్పటికీ అది కార్యరూపం దాల్చలేదు. ఈ స్కూళ్ల మంజూరు జీవో. నెంబర్ 223 ఈనెల 21న విడుదలైంది. మొత్తానికి వైరా నడిబొడ్డున ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో అన్నివర్గాల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పచ్చదనంతో.. మనసుకు ప్రశాంతత

- రూ.60లక్షలతో ఈఈసీ ఏర్పాటు చేస్తాం
- సత్తుపల్లి అర్బన్ పార్క్‌లో సీసీఎఫ్ బీమానాయక్



బ్యాటరీ వెహికిల్‌లో పార్క్‌ను పరిశీలిస్తున్న సీసీఎఫ్ బీమానాయక్

సత్తుపల్లి, నవంబర్ 25 (ఆంధ్రజ్యోతి) : పచ్చదనంతో మనసుకు ప్రశాంతత కలిగేలా ఆహ్లాదకరమైన వాతావరణంలో ఆనందంగా గడపాలనే ఉద్దేశ్యంతో అడవులను, పార్క్‌లను అభివృద్ధి చేస్తున్నట్టు సీసీఎఫ్ బీమానాయక్ అన్నారు. సత్తుపల్లి పట్టణంలోని నీలాద్రి అర్బన్ పార్క్‌ను ఆయన డీఎఫ్‌వో సిద్ధార్థ విక్రమ్‌సింగ్‌తో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పార్క్‌లో పరిసరాలు, వన్యప్రాణులు, లేక్, కిడ్స్ ప్లే గ్రౌండ్, వాచ్ టవర్లను బ్యాటరీ వెహికిల్ ద్వారా ప్రయాణిస్తూ పరిశీలించారు. ఈ సందర్భంగా అభివృద్ధి గురించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్క్ చుట్టూరా వన్యప్రాణుల సంరక్షణార్థం 100శాతం రక్షణే లక్ష్యంతో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నామని, సింగరేణి ఫైన్ వైపు వారి సహకారంతో త్వరలోనే ఫెన్సింగ్ వేయించనున్నట్టు చెప్పారు. రూ.60లక్షల వ్యయంతో నిర్మించే ఈఈసీ (ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ సెంటర్)ను ఏర్పాటు చేసి అడవులు, వన్యప్రాణుల ఆవశ్యకతతోపాటు షేప్స్, నమూనాలతో వాటి జీవితాలను వివరించనున్నామన్నారు. ఇప్పటికే నిర్మితమైన లైబ్రరీ ద్వారా న్యూస్ పేపర్ రీడింగ్, పర్యావరణం, అడవుల ప్రాముఖ్యతను వివరించే పుస్తకాలను పొందుపరుస్తామని చెప్పారు. అదేవిధంగా వన్యప్రాణులకు తక్షణమై వైద్య సహాయం కోసం రెస్క్యూ సెంటర్‌ను ఏర్పాటుచేసి సంరక్షించనున్నామని చెప్పారు.

చిన్నారులకు మరింత ఆహ్లాదాన్ని పంచేందుకు స్పోర్ట్స్, గేమ్స్ ఆర్టికల్స్‌ను ఏర్పాటు చేస్తామని, లేక్‌లో పెడల్ బోట్లతో మరింత సంతోషం ప్రజలకు అందించనున్నామని చెప్పారు. ప్రజలు సైతం ఈ పార్క్‌ను మనదిగా భావించి సంరక్షించి సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎఫ్‌డీవో వాడపల్లి మంజుల, రేంజర్ స్నేహలతోపాటు డీఆర్‌వో ముత్యాలరావు, ఎఫ్‌ఎస్‌వో, ఎఫ్‌బీవోలు, సిబ్బంది పాల్గొన్నారు

అశ్రునయనాలతో అబ్బయ్యకు అంతిమ వీడ్కోలు

ఇల్లెందు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య అంత్యక్రియలు సోమవారం ఆయన స్వగ్రామం హన్మంతులపాడులో జరిగాయి. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి అభిమానులు, వివిధ పార్టీల నాయకులు హాజరయ్యారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వచ్చి అబ్బయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేశ్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు తుళ్లూరు బ్రహ్మయ్య, పలిగండ్ల మధవరావు, ఇల్లెందు మునిసిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు కోనేరు చిన్ని, ఎస్‌కే జానీ, దొడ్డ డానియల్, బీజేపీ నాయకులు కొల్లి సంజీవరెడ్డి, సింగరేణి కార్మిక నాయకులు మారెపల్లి కుమారస్వామి, టీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్, పరుచూరి వెంకటేశ్వరావు, బానోత్ హరిసింగ్‌నాయక్, సీపీఐ నాయకులు దేవరకొండ శంకర్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పూనెం శ్రీనివాస్, తదితరులు అబ్బయ్య మృతదేహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అంతిమ యాత్రలో వందలాది అభిమాలు తరలివచ్చారు.



నివాళులర్పిస్తున్న మంత్రి తుమ్మల, బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేష్‌రెడ్డి

నేడు, రేపు ప్రజాపాలన విజయోత్సవాలు

ఖమ్మం కలెక్టరేట్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలను జిల్లాలో మంగళ, బుధవారాల్లో నిర్వహించనున్నట్టు కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న నేపథ్యంలో ప్రజాపాలన ప్రజా విజయోత్సవ కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందన్నారు. దీనిలో భాగంగా మంగళవారం ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో, బుధవారం ఖమ్మం రూరల్ మద్ది ఎల్లారెడ్డి ఫంక్షన్ హాలులో జయ జయహే ప్రజా పాలన అనే కళాబృందం అలేఖ్య సారథ్యంలో సాయంత్రం 6.00 గంటల నుంచి వివిధ కళా రూపాలలో ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహిస్తారని తెలిపారు. గత సంవత్సరకాలంలో సాధించిన విజయాలను తెలుపుతూ కళా ప్రదర్శనలు చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

పోడు భూముల్లో ఆయిల్‌పామ్ సాగు

(5వ పేజీ తరువాయి)

ఎంపిక చేసి ఆయా గిరిజన రైతులకు అవగాహన కల్పిస్తారు. నీటివనరులు లేనిచోట సీఎం గిరివికాస పథకం కింద ఐటీడీఏ సహకారంతో పోడు పట్టాలు కలిగిన రైతులకు బోర్లు, మోటార్లు, విద్యుత్ లైన్లు ఏర్పాటు చేస్తారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో ఈ పథకం అమల్లో ఉంది. విద్యుత్‌లైన్లు సాధ్యం కానిచోట సోలార్ పంపుసెట్లు కూడా అందించే అవకాశం ఉంది. పోడుభూముల్లో ఆయిల్‌పామ్ సాగుకు గిరివికాస్ పథకాన్ని అనుసంధానం చేయడం ద్వారా రైతులకు సాగునీటి సమస్య తీరడంతో పాటు ఆయిల్‌పామ్ సాగు పెరిగే అవకాశం ఉంది.

రూ.50వేల ప్రోత్సాహకాలు..

ఆయిల్‌పామ్ సాగుచేసే రైతులకు ఉద్యానవనశాఖ ఎకరానికి రూ.50వేల వరకు ప్రోత్సాహకాలు అందిస్తోంది. అందులో మొక్కల సబ్సిడీకి రూ.11,600, డ్రిప్‌కు ఎకరానికి రూ.22,500, నాలుగేళ్ల పాటు ఆయిల్‌పామ్ సాగుచేసేందుకు ఎకరానికి రూ.16,800సాయం అందిస్తుంది. మొత్తంగా ఎకరానికి నాలుగేళ్లలో రూ.50వేల వరకు ప్రోత్సాహకాలు అందిస్తున్నారు. దీంతో పాటు ఆయిల్‌పామ్ దిగుబడి వచ్చే వరకు నాలుగేళ్లపాటు అంతరపంటలుగా పెసర, మినుము, కూరగాయలు, మిర్చి వంటివి సాగు చేసుకునే అవకాశం ఉంది.

ఆ తర్వాత ఆయిల్‌పామ్‌లో అంతరపంటగా వక్క, జాజి, కోకో, మిరియాలు వంటి పంటలు వేసుకుని లాభాలు పొందవచ్చు. ప్రస్తుతం పామాయిల్ గెలల ధర టన్ను రూ.19,500పైగా పలుకుతోంది. రాబోయే రోజుల్లో ఈ ధర మరింత పెరిగే అవకాశం ఉంది. నికర ఆదాయ అవకాశం ఉన్నందున గిరిజన రైతులను కూడా ఆయిల్‌పామ్ సాగువైపు మళ్లించేందుకు ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేస్తోంది.

ఆయిల్‌పామ్ విస్తరణకు సర్వే...

మధుసూధన్, జిల్లా ఉద్యానవనశాఖ అధికారి

జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును మరితంగా పెంచేందుకు ఉద్యానశాఖ మండలస్థాయిలో సర్వే నిర్వహిస్తోంది. కొత్తగా సాగుచేసే రైతులకు ఇచ్చే ప్రోత్సాకాలపై అవగాహన కల్పిస్తున్నాం. ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వం భారీసంఖ్యలో పోడు పట్టాలు ఇచ్చింది. గిరిజన రైతులకు నికర ఆదాయం వచ్చేలా పోడుభూముల్లో ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే గిరిజన మండలాల్లో సర్వే కొనసాగుతోంది. సాగునీరు లేని చోట సీఎం గిరివికాస పథకం ద్వారా సాగునీరు ఇచ్చి ఆయిల్‌పామ్ వేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నాం.

నకిలీ బంగారంతో.. రుణ దందా

(5వ పేజీ తరువాయి)

ఖమ్మంలో పేరుగలిగిన మరికొన్ని వాణిజ్య బ్యాంకులు, ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీల్లో కూడా నకిలీ బంగారు ఆభరణాలు పెట్టి కోట్లలో రుణాలు పొందారన్న ప్రచారం జరుగుతుంది. అయితే బ్యాంకు మేనేజర్లు, అధికారులు తమ బ్యాంకు ప్రతిష్ఠ ఎక్కడ దెబ్బతింటుదోనన్న భయంతో నకిలీ ఆభరణాలు పెట్టిన వారిని పిలిచి రికవరీ చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే కొందరు పోలీసు కేసుల భయంతో సహకార బ్రాంచిల్లో కొందరు నగదు చెల్లించినట్టు తెలిసింది. పోలీసులకు కూడా ఏపీజీవీబీతోపాటు సహకార శాఖ బ్యాంకు అధికారులు తమ పరిధిలోని పోలీసులకు మౌఖికంగా నకిలీ బంగారంతో రుణాలు పొందిన వారి వివరాలు తెలియచేశారు. రెండు, మూడురోజుల్లో రికవరీ రానిపక్షంలో రాతపూర్వకంగా కేసులు పెట్టే అవకాశం ఉంది. సహకార బ్యాంకు బ్రాంచీలతో పాటు ఇతర బ్రాంచీల్లోనూ తాకట్టుపెట్టిన బంగారం అసలా.. నకిలీదా అన్నదానిపైనా కొన్ని బ్రాంచీలు పరిశీలిస్తున్నాయి. సహకార బ్యాంకు బ్రాంచీల్లో మాత్రం ఇప్పటికే నకిలీ బంగారు కడియాలు, బ్రాస్‌లెట్లతో సుమారు రూ.30లక్షల రుణాలు పొందినట్టు లెక్కతేలింది. రుణాలు తీసుకున్న వారినుంచి రికవరీ చర్యలు చేపట్టారు. అయితే ఈ రుణాలు పొందిన వారంతా ఒకే ముఠా సభ్యులుగా గుర్తించారు. ఖమ్మం, ఖమ్మంరూరల్ మండలంలోని పలు గ్రామాలతో పాటు ఖమ్మంలోని గిరిజనులు, నిరక్షరాస్యుల ఆధార్‌కార్డులతో బ్యాంకు అకౌంట్లు తీసుకని వారిపేరు మీద బంగారం తాకట్టుపెట్టి రుణాలు పొందినట్టు తెలిసింది. ఇతర బ్రాంచీల్లో కూడా పూర్తిస్థాయి విచారణ జరిగితే ఈ నకిలీ బంగారం రుణాలు కోట్లల్లో ఉండే అవకాశం ఉంది.

కేసులు పెట్టని బ్యాంకులు

బ్యాంకుల్లో నకిలీ బంగారంతో పెద్దఎత్తున రుణాలు పొందినా సహకార శాఖ బ్రాంచీలతోపాటు ఇతర బ్రాంచీలు బ్యాంకు అధికారులు కేసులు పెట్టకపోవడం చర్చనీయాంశంగా మారింది. నకిలీ బంగారం అని తేలినప్పటికి రాతపూర్వకంగా కేసులు పెట్టకపోవడంతో పోలీసులు విచారణకు ముందడుగు వేయలేకపోతున్నారు. రుణాలు రికవరీ కానీ వారిపైనే కేసులు పెట్టే ఆలోచలనతో బ్యాంకు అధికారులున్నారు. ఇదిలావుండగా, బంగారు ఆభరణాలపై రుణాలు ఇచ్చే ముందు అవి అసలువా.. నకిలీవా అనేది తేల్చడానికి బ్యాంకులకు అప్రైజర్లు ఉంటారు. వీరు ధ్రువీకరించిన తర్వాతే బ్యాంకు అధికారులు రుణాలు మంజూరుచేస్తారు. తాజా కుంభకోణంలో అప్రైజర్ల పాత్ర ఏమిటనేది పోలీసులు తేల్చాల్సి ఉంది.

నగరంలో త్వరలో డ్వాక్రా బజార్

తల్లాడ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలో తయారయ్యే ఉత్పత్తులకు 'మేడ్ ఇన్ ఖమ్మం' అని బ్రాండ్ ఏర్పాటుచేస్తామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. సోమవారం తల్లాడ మండలంలో కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా తల్లాడ మండలం అంజనాపురం గ్రామాన్ని సందర్శించి స్వయం సహాయక సంఘాల మహిళలతో మాట్లాడారు. వెదురుతో తయారుచేసిన చాటలు, బుట్టలు, అలంకరణ సామగ్రి తయారీని పరిశీలించారు. ఏఏ వస్తువులు తయారుచేస్తున్నది. తయారీకి పడుతున్న సమయం, ఖర్చు.. ఎంతకు అమ్ముతున్నదని, ఎక్కడ అమ్ముతున్నది అడిగి తెలుసుకున్నారు. తయారీ ఖర్చు కంటే తక్కువ ధరకు అమ్మడం గ్రహించి మధ్యవర్తులు లేకుండా నేరుగా వినియోగదారులకు అమ్మితే లాభం వస్తుందని ఇందుకు షెడ్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఖమ్మం టీటీడీసీ సమీపంలో డ్వాక్రా బజార్ ఏర్పాటుచేయనున్నట్టు ఈ ఉత్పత్తులను డ్వాక్రా బజార్‌లో నేరుగా అమ్ముకుంటే లాభదాయకంగా ఉంటుందన్నారు. తల్లాడలో ఇందిర మహిళా శక్తి కింద ఏర్పాటుచేసిన ఫ్యాన్సీ, జనరల్ స్టోర్‌ను కలెక్టర్ ప్రారంభించారు. తల్లాడలోని పొలాలను సందర్శించారు. చల్లా లక్ష్మయ్య వరిపొలంలో వరికోతను పరిశీలించారు. హార్వేస్టర్‌పైకి ఎక్కి వరికోత విధానాన్ని పరిశీలించారు. వరిపొలం గట్టుపై కూర్చొని పంటల సాగు ఆదాయ ఖర్చుల గురించి రైతులతో ముచ్చటించారు. వరి, పత్తి పంటల సాగు వల్ల వాతావరణం అనుకూలించి దిగుబడి ఆశాజనకంగా ఉండి మార్కెట్ సౌకర్యం అనుకూలంగా ఉంటే ఎకరాకు రూ.30వేల మేరకు ఆదాయం వస్తుందని రైతులు చెప్పడంతో వీటికి ప్రత్యామ్నాయంగా అధిక ఆదాయం వచ్చే ఆయిల్‌పామ్ సాగు చేయాలంటూ కలెక్టర్ సూచించారు. ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారి తాజుద్దీన్‌ను కలెక్టర్ ఆదేశించారు. ముందుగా స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. మండలస్థాయి అధికారులంతా సమన్వయంతో మండలంలోని పాఠశాలలు, హాస్టల్స్, ఆరోగ్య ఉపకేంద్రాలను సందర్శించాలని, ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో ఎస్.సన్యాసయ్య, తహసీల్దార్ ఏ.వనజ, ఎంపీడీవో చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా కోటి దీపోత్సవం

ఖమ్మం సాంస్కృతికం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో దీపా న్ని వెలిగించటం ద్వారా సకల కష్టాల నుంచి గట్టెక్కే అదృష్టం లభిస్తుందని మాజీ స్పీకర్ మధుసూదనాచారి అన్నారు. ఖమ్మంలోని శివాలయంపై తనకు ఎంతో విశ్వాసం ఉందని, తాను ఈ రోజు ఈ స్థితిలో ఉండేందుకు స్వామి కరుణాకటాక్షాలే కారణం అన్నారు. చాలా సంవత్సరాలుగా తాను ఇక్కడ దీపోత్సవానికి హాజరవుతున్నానని, వచ్చిన ప్రతిసారీ ఏదో మానసిక ఆనందం తనను ఆవరిస్తోందన్నారు.

ఘనంగా కోటి దీపోత్సవం..

కార్తీకమాసం చివరి సోమవారం సందర్భంగా ఖమ్మం ఎంబీ గార్డెన్స్ ప్రాం తంలోని మహాచక్ర పీఠం శివాలయం వద్ద కోటి దీపోత్సవం ఘనంగా జరిగిం ది. కార్యక్రమాన్ని శాసనసభ మాజీ స్పీకర్ సిరికొండ మధుసూధనాచారి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వందలాది మంది మహిళలు భక్తి దీపాలను వెలిగించారు. సంప్రదాయబద్ధంగా దీపాలకు పసుపు కుంకుమ లు, తదితర పూజా ద్రవ్యాలతో పూజిస్తూ దీపాలను వెలిగించారు. ఒకో మహిళ 365, వత్తులను వెలిగించ గా కొందరు లక్ష వత్తులతో దీపాలను వెలిగించారు. భక్తులకు ప్రమిదలు, వత్తులు, నూనె, తదితర పూజా ద్రవ్యాలను ఆలయ అర్చకుడు, కార్యక్రమ నిర్వాహకుడు సత్తెనపల్లి ఉమామహేశ్వరరావు ఉచితంగా అందజేశారు. అనంతరం ఖమ్మం నగరంలో ప్రముఖ న్యాయవాది అద్దంకి నా గేశ్వరరావు గారి ఇంటికివచ్చి వారి ఆతిథ్యం స్వీకరించారు. అనంతరం ఖానాపురంలో వేంచేసి ఉన్న అభయ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి పూజ లు నిర్వహించారు. ఈ కార్యక్రమలో పెండోట సోమేశ్వరాచారి, వెగ్గళం వెంకటేశ్వర్లు గౌరోజు వసంత్ బాబు, ఆలయ చైర్మన్ బొల్లి కొమరయ్య, కమిటీ సభ్యులు జ్యోతిరెడ్డి, సుబ్బాచారి పాల్గొన్నారు

భద్రాద్రి జిల్లా అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

(5వ పేజీ తరువాయి)

ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు ఉన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రంథాలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్రంలో ఉన్నటువంటి 600 గ్రంథాలయాలను పునరిద్ధరించాలని, వాటిలో అవసరమైన పుస్తకాలతోపాటు ఫర్నిచర్, మౌలిక వసతులను సమకూర్చాలన్నారు. గతంలో భద్రాద్రికి అమరావతి నుంచి భద్రాచలం మీదుగా జగదల్‌పూర్ వరకు జాతీయ రహదారిని ఏర్పాటుచేశామని, మరో జాతీయ రహదారిని కొత్తగూడెం నుంచి ఇల్లెందుమీదుగా హైదరాబాద్‌కు త్వరలోనే అందుబాటులోకి తేనున్నట్టు మంత్రి తెలిపారు. పాండురంగాపురం నుంచి భద్రాచలం వద్దనున్న సారపాక వరకు రైల్వేలైన్ ఏర్పాటుకోసం కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్లి ఒత్తిడి తీసుకువస్తున్నామని, అది కార్యరూపం దాల్చితే దక్షిణ అయోధ్యగా పిలువబడే భద్రాచలం నుంచి ఉత్తర భారతదేశానికి అనుసంధానం ఏర్పడుతుందని అన్నారు. రాష్ట ప్రభుత్వం వరంగల్ మామునూరు, ఆదిలాబాద్, కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టులు ఏర్పాటు చేసేందుకు ఆలోచన చేస్తుందన్నారు. కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టు నిర్మాణం చేపడితే సింగరేణి, బీటీపీఎస్, నవభారత్, ఐటీసీ, హెవీవాటర్ వంటి పరిశ్రమలు ఉన్న ఈ ప్రాంతానికి అనేక ప్రయోజనాలు చేకూరుతాయన్నారు. కొత్తగూడెం ఎయిర్‌పోర్టు విషయంలో అవసరమైన స్థలానికి సంబంధించి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపడం జరిగిందన్నారు. అదేవిధంగా పోలవరం ప్రాజెక్టు పూర్తి అయితే నావిగేషన్ విభాగంలోనూ ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, గోదావరిని నౌకాయానానికి ఉపయోగించుకున్నట్లయితే అతి తక్కువ ధరలకే ట్రాన్స్‌పోర్టు సౌకర్యం అందుబాటులోకి వస్తుందన్నారు. కొత్తగూడెం బైపాస్ రోడ్ విషయంలో కొంత జాప్యం ఏర్పడిందని ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రితో మాట్లాడి పనులు పూర్తిచేస్తామని అన్నారు. రైతులు ఇతర పంటలు వేయడం ద్వారా ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వాటి నుంచి బయట పడాలంటే తప్పకుండా ఆయిల్‌పామ్ పంటను ఎంచుకోవాలని సూచించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి తుమ్మల

మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు మంత్రి తుమ్మలతోపాటు రాష్ట్ర ప్రభుత్వ సహకారం తీసుకుంటామన్నారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని అన్నారు. ఇందుకు అందరి సహకారం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్, ఎస్పీ రోహిత్‌రాజ్, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, విద్యాచందన, డీసీఎంఎస్ చైర్మన్ శ్రీనివాస్, మునిసిపల్ చైర్‌పర్సన్ సీతాలక్ష్మి పాల్గొన్నారు.

కన్నపేగుకు వెల

(5వ పేజీ తరువాయి)

పాప పుట్టింది. అయితే ఆ బిడ్డను పెంచుకోలేనని ఎవ్వరికైనా అమ్ముతానని తన సోదరి ఆశకు చెప్పింది. వారి సమీప బంధువైన తిరుమలాయపాలెం మండలం బీరోలు గ్రామానికి చెందిన సత్యవతి అనే మహిళ తనకు బిడ్డ కావాలని చెప్పడంతో ఆమెను సంప్రదించారు. రూ.1.20లక్షలకు బిడ్డను ఇచ్చేందుకు ఇద్దరి మధ్య బేరం కుదరగా మూడు రోజుల క్రితం బిడ్డను సత్యవతికి ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నారు. అయితే ఈలోపే శిశువు తల్లి రుక్మిణికి ఆమె సోదరి ఆశకు డబ్బు విషయంలో గొడవ జరిగింది. పాపను విక్రయించగా వచ్చిన డబ్బులో తనకూ వాటా కావాలని ఆశ అడగడంతో అందుకు రుక్మిణి నిరాకరించింది. దీంతో ఆశ ఐసీడీఎస్ సిబ్బందికి ఫోన్ చేసి పసిపాపను విక్రయిస్తున్నారని సమాచారం అందించింది. దీంతో అధికారులు అప్రమత్తమై పోలీసుల సహకారంతో నగరంలోని నూతన బస్‌స్టాండ్ వద్ద బిడ్డతో వస్తున్న రుక్మిణిని పట్టుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులు ఆమెతో మాట్లాడగా అసలు విషయం బయటపడింది. కాగా రుక్మిణిని పోలీసులు పట్టుకున్న ఘటనను దూరం నుంచి గమనించిన సత్యవతి అక్కడి నుంచి వెళ్లిపోయింది. ఈ ఘటనపై ఐసీడీఎస్ అధికారులు ఆదివారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై ఖమ్మం టూటౌన్ సీఐ బాలక్రిష్ణను వివరణ కోరగా కేసు నమోదు చేశామని, ఇద్దరి మధ్య బేరం జరిగినా ఎలాంటి లావాదేవీలు మాత్రం జరగలేదని తెలిపారు.



పతకాలు సాధించిన క్రీడాకారులు

కేయూ ఇంటర్ బాక్సింగ్‌లో ముగ్గురికి పతకాలు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ ఇంటర్ బాక్సింగ్ పోటీల్లో ముగ్గురు విద్యార్థులకు వెండి పతకాలు వచ్చాయని జిల్లా బాక్సింగ్ జట్టు కోచ్ అండ్ మేనేజర్ సత్యబాబు సోమవారం తెలిపారు. పాల్వంచ డిగ్రీ కళాశాలకు చెందిన కె.సాయిఉదయ్ 54 కేజీల విభాగం, బి.హేమంత్‌కుమార్ 85 కేజీల విభాగం, భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన వి.వినయ్ 80 కేజీల విభాగంలో పాల్గొని ప్రతిభ చాటారని తెలిపారు.

జమలాపురం ఆలయ ధార్మిక భవనం ప్రారంభం



ధార్మిక భవనాన్ని ప్రారంభిస్తున్న దాత, మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య

ఎర్రుపాలెం, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): జమలాపురం శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం ధార్మిక భవనాన్ని ఈవో కొత్తూరు జగన్మోహన్ రావు ధర్మకర్త శ్రీరామచంద్రమూర్తితో కలిసి దాత చిన్నం రామకోటయ్య సోమవారం ప్రారంభించారు. ఆలయ దేవస్థాన పరిపాలనకు సంబంధించిన కార్యకలాపాలకు కార్యాలయం నిర్మించాలని ఆలయ అధికారులు, అర్చకులు కోరగానే ఏపీలోని ఏలూరు జిల్లా చాట్రాయి గ్రామానికి చెందిన నూజివీడు మాజీ ఎమ్మెల్యే చిన్నం రామకోటయ్య స్పందించారు. ధార్మిక భవన నిర్మాణానికి ముందుకొచ్చి సుమారు రూ.65లక్షలు వెచ్చించి వారి తండ్రి చిన్నం సుబ్బారావు జ్ఞాపకార్థం అన్ని వసతులు, హంగులతో గొప్ప కార్యాలయ నిర్మాణాన్ని ఏడాదికాలంలోనే పూర్తిచేసి దేవస్థానంకు అప్పగించారు. ఈకార్యక్రమంలో వకుళాభరణం స్టేడియం నిర్మాణ దాత తుళ్లూరి కోటేశ్వరరావు, ప్రధాన అర్చకుడు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ కె.వి జయకుమారి, నిర్మాణ నిర్వాహకుడు ఉప్పల రాజీవ్‌శర్మ, ఆలయ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

జేఎన్టీయూ కాలేజీలో సౌకర్యాలు నిల్..

- అడ్మిషన్లు రద్దు చేసుకున్న విద్యార్థులు
- ఏడాది దాటినా ముందుకు కదలని కళాశాల భవన నిర్మాణ మంజూరు ఫైల్
- అరకొర వసతులతో ఇంజనీరింగ్ బ్రాంచ్‌లలో తగ్గిన ప్రవేశాలు

ఖమ్మం ఖానాపురంహవేలి, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లాలోని మదుల్లపల్లిలోగల జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అరకొర సౌకర్యాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కళాశాలలో ల్యాబ్, హాస్టల్ సరిగా లేవు. అడ్మిషన్ల ప్రక్రియ మొదట్లో భారీ సంఖ్యలో విద్యార్థులు ఆసక్తి చూపారు. కాని కళాశాలలో వసతులు లేకపోవడంతో కొందరు సీట్లు రద్దు చేసుకున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే వచ్చే ఏడాదైనా శాశ్వత భవనంలోనే తరగతులు నిర్వహించాలన్న సర్కారు లక్ష్యం నెరవేరేలా కనిపించటం లేదు.



తాత్కాలిక భవనంలో కొనసాగుతున్న ఇంజనీరింగ్ కళాశాల

రూ.300 కోట్లతో ప్రతిపాదనలు

కళాశాల శాశ్వత భవన నిర్మాణానికి మద్దులపల్లి రెవెన్యూ పరిధిలో 30 ఎకరాల భూమిని అధికారులు కేటాయించారు. మొత్తం భవన నిర్మాణానికి రూ. 300ల కోట్లు అంచనా వేయగా మొదటి విడతగా రూ.100 కోట్ల ప్రతిపాదనలును ప్రభుత్వానికి పంపారు. మిగిలిన రూ. 200ల కోట్లను విడతలవారీగా ఇవ్వాలని ప్రతిపాదించారు. తొలి విడతగా తరగతులు, అకడమిక్ భవనం, పరిపాలన వసతిగృహాలు, ప్రయోగశాలల నిర్మాణానికి రూ. 100కోట్ల అవసరమని గుర్తించారు. కాని రెండో విద్యాసంవత్సరం ప్రారంభమైనా భవన నిర్మాణాలకు శంకుస్థాపనే జరగలేదు.

గత ఏడాది కౌన్సెలింగ్ సమయంలో జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల మంజూరైంది. ఖమ్మం గ్రామీణ మండలం మద్దులపల్లిలోని యువజన శిక్షణ కేంద్రం (వైటీసీ) భవనంలో తాత్కాలికంగా కళాశాలను నిర్వహిస్తున్నారు. ఇంజనీరింగ్ రెండో సంవత్సరంలో 79 (సీఎస్ఈ-61, డేటా సైన్స్-18) మంది అభ్యసిస్తున్నారు. ఈఏడాది. ప్రథమ సంవత్సరంలో 144 (డేటా సైన్స్-35, సీఎస్ఈ-63, ఈసీఈ-27, ఈఈఈ-14, మెకానికల్-05) మంది ప్రవేశాలు పొందారు. మొత్తం 223 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడే తరగతులతో పాటు ప్రయోగశాలను నిర్వహిస్తున్నారు. బాలురకు వసతి సౌకర్యం కల్పిస్తున్నారు. బాలికల వసతి కోసం ప్రైవేటు భవన సముదాయాన్ని అద్దెకు తీసుకున్నారు.

అక్కడ సీటు.. వద్దంటే వద్దు..

తొలి సంవత్సరం రెండు గ్రూపుల్లో 79 అడ్మిషన్లు రాగా రెండో ఏడాది తగ్గిపోయాయి. సరైన సౌకర్యాలు లేకపోవటంతోనే అడ్మిషన్ల సంఖ్య తక్కువగా ఉంది. జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో అడ్మిషన్లు రావటమంటే గొప్పగా చెప్పుకొంటారు. కానీ ఖమ్మంలో మాత్రం వచ్చిన సీట్లను వదులుకుంటున్నారు. 2025-26 విద్యా సంవత్సరానికైనా సొంత భవనాలు అందుబాటులోకి రాకుంటే విద్యార్థుల అడ్మిషన్లు మరింత తగ్గే అవకాశం ఉంది. కాగా ఇప్పటికీ సొంత భవనాల ఫైల్ ముందుకు సాగకపోవడమే దీనికి కారణంగా తెలుస్తోంది.

వచ్చే యేడాదికి సొంత భవనాలు
రమేశ్, ప్రిన్సిపాల్, జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల

జేఎన్‌టీయూ మద్దులపల్లి కళాశాలకు 2025-26 విద్యా సంవత్సరాని కల్లా నూతన భవనాలు ఏర్పాటు కానున్నాయని ఆశిస్తున్నాం. జిల్లాలోని ముగ్గురు మంత్రుల, అధికారుల సహకారంతో త్వరలోనే సొంత భవనాల నిర్మాణాలు ప్రారంభంకానున్నాయి. సొంత భవనం నిర్మాణం పూర్తయ్యే వరకు అద్దె భవనంలోనే తరగతులు నిర్వహిస్తాం. వైటీసీలో కొనసాగుతున్న కళాశాలను జేఎన్టీయూ రిజిస్ట్రార్ కె.వెంకటేశ్వర్లు ఇటీవల పరిశీలించి శాశ్వత భవన నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని సందర్శించారు. కళాశాలకు ఉన్న సమస్యలను వివరించాం. త్వరలోనే ప్రభుత్వం నుంచి నిధులు విడుదలవుతాయని ఆశిసున్నాం.

కేయూ డిగ్రీ సెమిస్టర్ పరీక్షల రీ షెడ్యూల్

కేయూక్యాంపస్, నవంబరు 25: (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని నవంబరు 26 నుంచి జరుగాల్సిన డిగ్రీ 1, 3, 5వ సెమిస్టర్ పరీక్షలను రీ షెడ్యూల్ చేశారు. ఈనెల 26, 27, 28 తేదీల్లో జరుగాల్సిన సబ్జెక్టులను పరీక్షల టైం టేబుల్‌లో పేర్కొన్న పరీక్షలన్నీ ముగిసిన తర్వాత తేదీల్లో నిర్వహిస్తామని పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ ఎం. తిరుమలదేవి, డాక్టర్ పి. వెంకటయ్య సోమవారం వెల్లడించారు. గతంలో ప్రకటించిన ప్రకారం నవంబరు 29వ తేదీ నుంచి జరిగే పరీక్షలన్నీ యథావిధిగా జరుగుతాయని స్పష్టం చేశారు.

- రీషెడ్యూల్ పరీక్షల వివరాలు ఇవే..

- నవంబరు 26న మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు జరగాల్సిన డిగ్రీ మొదటి సెమిస్టర్ బీఏ, బీఏ (లాంగ్వేజేస్)బీబీఏ, బీకామ్, బీఎస్సీ కోర్సుల పరీక్షలన్నీ డిసెంబరు 27కు వాయిదా వేశారు.
- నవంబరు 27న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరుగాల్సిన డిగ్రీ మూడవ సెమిస్టర్ బీఏ, బీఏ (లాంగ్వేజేస్)బీబీఏ, బీకామ్, బీఎస్సీ కోర్సుల పరీక్షలన్నీ డిసెంబరు 28కు వాయిదా వేశారు.
- నవంబరు 26న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరుగాల్సిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ బీఏ, బీఏ (లాంగ్వేజేస్)బీబీఏ, బీకామ్, బీఎస్సీ కోర్సుల పరీక్షలన్నీ డిసెంబరు 27కు వాయిదా వేశారు.
- నవంబరు 28న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు జరుగాల్సిన డిగ్రీ ఐదవ సెమిస్టర్ బీఏ, బీఏ (లాంగ్వేజేస్)బీబీఏ, బీకామ్, బీఎస్సీ కోర్సుల పరీక్షలన్నీ డిసెంబరు 30కి వాయిదా వేశారు. వీటితో పాటు బీసీఏ మొదటి సెమిస్టర్, మూడవ సెమిస్టర్, ఐదవ సెమిస్టర్ పరీక్షలను రీషెడ్యూల్ చేసినట్లు పరీక్షల నియంత్రణాధికారులు వెల్లడించారు.

ప్రైవేట్ కళాశాలలు తమ డిమాండ్‌ల సాధన కోసం సమ్మెకు దిగడంతో విద్యార్థుల నుంచి పరీక్షల ఫీజుల వసూలు చేపట్టలేదు. అలాగే ఆర్థిక ఇబ్బందులతో కొన్ని ప్రైవేట్ కళాశాల యాజమాన్యాలు అప్లికేషన్ ఫీజులను చెల్లించలేదు. దీంతో కేయూ పరీక్షల నియంత్రణాధికారులు ప్రైవేట్ కళాశాల విద్యార్థులతో పాటు కొన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాల హాల్ టికెట్లను వర్సిటీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయలేదు. దీంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. అసలు పరీక్షలు నిర్వహిస్తారా లేదా తమ పరిస్థితి ఎంటి అంటూ ఆందోళనకు గురయ్యారు. చివరకు ప్రైవేట్ కళాశాలలు సమ్మె విరమించి ఫీజుల చెల్లింపు కొలిక్కి రావడంతో పరీక్షల తాత్కాలికంగా మూడు రోజులు పాటు రీషెడ్యూల్ చేసి మిగతా పరీక్షలను యథావిధిగా నిర్వహిస్తామని వర్సిటీ అధికారులు ప్రకటించారు.

చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం

- రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రాయల

ముదిగొండ, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు ద్వారా ప్రతి గింజా కొనుగోలు చేస్తామని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ముదిగొండ మండలంలోని మల్లన్నపాలెం, చిరుమర్రి గ్రామాల్లో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ధాన్యం రైతులు కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దళారులను నమ్మి మోసపోవద్దని పేర్కొన్నారు. కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు ద్వారా మద్దతు ధర పొందవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, డైరెక్టర్ వనం ప్రదీప్త పాల్గొన్నారు.



ఖమ్మం ఎస్పీ ఆఫీసు రోడ్డు శివాలయంలో భక్తులు



గుంటు మల్లీశ్వరస్వామి ఆలయంలో దీపారాధన

భక్తి శ్రద్ధలతో కార్తీక సోమవారం

- శివాలయాల్లో భక్తుల సందడి

ఖమ్మం సాంస్కృతికం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసంలో చివరి సోమవారాన్ని జిల్లా వ్యాప్తంగా భక్తులు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శివాలయాలను సందర్శించి పూజలు నిర్వహించటంతో ఖమ్మం నగరంతోపాటు జిల్లా వ్యాప్తంగా శైవ క్షేత్రాలు భక్తులతో సందడిగా మారాయి. తెల్లవారు ఝామునుంచే ఆలయాలను సందర్శించిన భక్తులు ఆలయాల్లో దీపాలను వెలిగించటంతోపాటు శివయ్యను దర్శించేందుకు ఆసక్తి చూపారు. దీంతో అన్ని దేవాలయాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు బారులు తీరి కనిపించారు. ఈసందర్భంగా శివుడిని పాలు, తదితర పూజా ద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. ఖమ్మంలోని పురాతన గుంటుమల్లేశ్వర స్వామి దేవాలయం, సుగ్గల వారి తోట శివాలయం, బ్రాహ్మణ బజార్‌లోని శివాలయంతోపాటు పోలీస్ లైన్ లోని శివపంచాయతనం తదితర దేవాలయాల్లో భక్తుల సందడి కనిపించింది.

25 కిలోల గంజాయి పట్టివేత

- ఖమ్మానికి చెందిన యువకుల అరెస్ట్
- రూ.2.50లక్షల గంజాయి, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం



నిందితుల వివరాలు తెలుపుతున్న ఆబ్కారీ సీఐ శ్రీనివాస్, రాజశేఖర్

అశ్వారావుపేటరూరల్/బూర్గంపాడు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): గంజాయిని రవాణా చేస్తుండగా ఆబ్కారీశాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం సాయంత్రం యువకులను అదుపులోకి తీసుకున్నారు. స్థానిక ఆబ్కారీశాఖ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఈ వివరాలను ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాస్, స్థానిక సీఐ రాజశేఖర్ వెల్లడించారు. ఖమ్మం ముస్తాఫానగర్‌కు చెందిన ములకలపల్లి ఉదయ్, బండారు నాగేంద్రబాబు, మరో వ్యక్తి ఆంధ్రాలోని చింతూరు ప్రాంతం నుంచి గంజాయిని తీసుకుని ఖమ్మం వెళతున్నారు.పాల్వంచ, కొత్తగూడెం ప్రాంతాల్లో తనిఖీలు ఉంటాయని, అశ్వారావుపేట మీదుగా అయితే పట్టుబడకుండా వెళ్లవచ్చని భావించారు. ఈ నేపథ్యంలో భద్రాచలం నుంచి అశ్వారావుపేట వైపుకు రెండు ద్విచక్ర వాహనాలపై ప్రయాణం ప్రారంభించారు.సుమారు రూ.2.50లక్షలు విలువ చేసే 10.4 కిలోల గంజాయిని తీసుకుని వస్తున్నారు. పక్కా సమాచారం మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది మండలంలోని ఊట్లపల్లి వద్ద తనిఖీలు నిర్వహించారు. గంజాయి రవాణా చేస్తున్న యువకులను అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురిలో ఒకరు పారిపోగా ఉదయ్, నాగేంద్రబాబుతో పాటు రెండు ద్విచక్ర వాహనాలను స్థానిక స్టేషన్‌కు తరలించారు. ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. సమావేశంలో ఎస్ఐ రాజేశ్వరరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది కరీం, హనుమంతు, హరీశ్, సుధీర్ ఉన్నారు.

బూర్గంపాడు: బూర్గంపాడు మండలంలోని సారపాక వద్ద రూ.3.82 లక్షల విలువైన 15.30 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు సీఐ వినయ్ కుమార్, ఎస్సై రాజేష్ తెలిపారు. పల్లె ప్రకృతి వనం సమీపంలో కారును తనిఖీ చేయగా, గంజాయి రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. కారులో ఉన్న మధ్యప్రదేశ్‌కు చెందిన శ్యామల సర్కార్, దీవన్‌సింగ్, కుస్వ, మున్నికుస్వ, రాజిపాల్‌కుస్వలను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. హోండాసిటీ కారుతో పాటు ఐదుసెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్ నిమిత్తం తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

జీవో 12,16ను రద్దు చేయాలి

- కోర్టులో న్యాయవాదుల నిరసన



ఖమ్మం కోర్టు ఎదుట నిరసన తెలుపుత్ను న్యాయవాదులు

ఖమ్మంలీగల్, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): సోమవారం కోర్టు ఆవరణలో నాన్ క్యాడర్ పీపీ పోస్టులను క్యాడర్ చేయవద్దని జీవో నెం.12 మరియు 16ను రద్దుచేయాలని న్యాయవాదులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో బార్ కౌన్సిల్ సభ్యులు కొల్లి సత్యనారాయణ, నిరంజన్‌రెడ్డి, బిచ్చాల తిరుమలరావు, కొత్త వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ప్రకారం క్యాడర్ పోస్టులు 50శాతం ఉండాలని తీర్పు ఇచ్చారని గుర్తు చేశారు. క్యాడర్‌కి సంబంధించిన వారు ప్రమోషన్ల కోసం ఉద్యోగ సంఘాలతో ఒత్తిడి చేసి ప్రభుత్వాలను బ్లాక్‌మెయిల్ చేస్తూ జీవో నెంబర్ 12, 16ను తీసుకొచ్చారని ఆరోపించారు. ఈ జీవో ద్వారా క్యాడర్ పోస్టు ప్రమోషన్ తోని నాన్ క్యాడర్ పోస్టు లేకుండా చేయాలని కుట్ర పన్నారన్నారు. సుప్రీంకోర్టు జడ్జిమెంట్ ప్రకారం 50శాతం నాన్ క్యాడర్, 50శాతం క్యాడర్ ఉండాలని నాన్ క్యాడర్ పోస్టులను ప్రభుత్వం కక్షిదారులకు న్యాయం జరిగే విధంగా న్యాయనిపుణులను నియమించే అవకాశం ఉందని అన్నారు. దీనివలన కక్షిదారులకు సత్వర న్యాయం అందుతుందన్నారు. ఈవిషయంపై ఖమ్మం జిల్లా బార్ అసోసియేషన్ తీర్మానం చేసి సెక్రెటరీ రవిగుప్తాకు పంపామన్నారు. ఈ కార్యక్రమంలో కొల్లి సత్యానారాయణ, నిరంజన్‌రెడ్డి, ఎం.నాగేశ్వరరావు, కొత్త వెంకటేశ్వరరావు, మలీదు నాగేశ్వరరావు, బార్ సెక్రెటరీ చింతనిప్పు వెంకట్, ఓరుగంటి శేషగిరిరావు, తాళ్లూరి దిలీప్, ముక్కేశ్వరరావు తదితర సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల పాదయాత్రను విజయవంతం చేయండి

- తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ కృష్ణారావు

ఖమ్మంచర్చికాంపౌండ్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో కరీంనగర్ నుంచి వేములవాడ వరకు ఈనెల 27,28 తేదీల్లో చేపట్టిన మహాపాదయాత్రను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్రస్టీరింగ్ కమిటీ చైర్మన్ కేవీ కృష్ణారావు కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫేస్టోలో పొందుపరిచిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ పాదయాత్ర విజయవంతానికి తెలంగాణ ఉద్యమకారులందరు పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వానికి కనువిప్పు కలిగేలా చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య, రవిచంద్రచౌహాన్, రాచమల్లు ఉమాయాదవ్, వరలక్ష్మి, పెల్లూరి విజయ్‌కుమార్ , అనంతలక్ష్మి, స్వరూప ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఖమ్మం సీసీఎస్ ఏసీపీ



ఖమ్మంక్రైంనవంబరు25(ఆంధ్రజ్యోతి): ఖమ్మం సెంట్రల్ క్రైం స్టేషన్(సీసీఎస్) ఏసీపీగా నియమితులైన ఎండీ సర్వర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. పోలీసుకమిషనర సునిల్‌దత్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. హైదరాబాదు డీజీపీ కార్యాలయంలో ఏసీపీగా ఉన్న ఆయన ఇటీవల బదిలీల్లో భాగంగా ఖమ్మం వచ్చారు.

ఇసుక డంప్ సీజ్

మధిరరూరల్, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాయపట్నం వద్ద సిమెంట్ బ్రిక్స్ పంపిణీలో నిబంధనలకు విరుద్ధంగా డంప్ చేసిన ఇసుకను మధిర టౌన్ ఎస్ఐ నారబోయిన సంధ్య సీజ్ చేశారు. ఇసుక అక్రమార్కులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య

మణుగూరు, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాల నేపథ్యంలో తీవ్ర మానసిక ఒత్తిడికిలోనై ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ సంఘటన మండల పరిధిలోని చెరువు ముందు సింగారం గ్రామంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఆళ్లపల్లి మండల రాఘవపురం గ్రామానికి చెందిన రమేష్‌తో విప్పల సింగారం గ్రామానికి చెందిన ఈసం సునీతకు పదేళ్లక్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. వీరి మధ్య కలహాలు రావటంతో ఆరు సంవత్సరాలుగా భర్త నుంచి ఆమె దూరంగా తల్లి ఇంటి వద్ద నివాసముంటుంది. పిల్లలు భర్త వద్ద ఉంటున్నారు. కాగా సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో సునీత ఇంటో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ మేడ ప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితులు ఎవ్వరూ సోమవారం రాత్రి వరకు ఫిర్యాదు ఇవ్వలేదని, బాధితుల నుంచి ఫిర్యాదు అందిన పిదప పోలీసుల విచారణ ప్రారంభం అవుతుందన్నారు.

లాన్‌టెన్నిస్, బీచ్‌వాలీబాల్ జట్ల ఎంపిక



బాలుర బీచ్ వాలీబాల్ జట్టు

ఖమ్మం స్పోర్ట్స్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఖమ్మం, భద్రాద్రి(ఉమ్మడి) జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలో అండర్-14, 17 బాల, బాలికలకు లాన్‌టెన్నిస్, బీచ్‌వాలీబాల్ క్రీడా జట్ల ఎంపికలు నిర్వహించారు. ఎంపికలకు సుమారు 41మంది క్రీడాకారులు హాజరయ్యారు. ప్రతిభ చూపి జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారుల వివరాలను ఎజీఎఫ్ జిల్లా సెక్రెటరీ నర్సింహమూర్తి ప్రకటించారు.అండర్- 17 బీచ్‌వాలీబాల్ బాలుర జట్టులో విష్ణువర్ధన్, భాను, ప్రేంసాగర్, అండర్-14 జట్టులో రిషి, రాజు, జేమ్స్ అండర్-14 బాలికల బీచ్‌వాలీబాల్ జట్టులో ఆర్య, ప్రణిత, వర్షిత అండర్- 17 జట్టులో అంబిక, దీపిక, ప్రసన్న లాన్‌టెన్నిస్‌లో ఇషాన్ అహ్మద్ ఖాద్రి, స్వప్నిల్, వీరవర్ధన్, ధనుంజయరెడ్డి ఎంపికైనట్లు తెలిపారు.

సెల్‌ఫోన్ డ్రైవింగ్.. ప్రాణాలకు ముప్పు: ట్రాఫిక్ ఏసీపీ



ఖమ్మంక్రైం, నవంబరు25(ఆంధ్రజ్యోతి):సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రాణాలకు ముప్పని ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాసులు అన్నారు. నగరంలోని పలు ప్రధానకూడళ్ల వద్ద సోమవారం సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈడ్రైవ్‌లో సుమారు 45మంది వాహనదారులు సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడుపుతు పట్టుబడ్డారు. వారికి కౌన్సెలింగ్ నిర్వహించి, జరిమానా విధించారు.నగరంలో సెల్‌ఫోన్ డ్రైవింగ్ కేసులుపెరుగుతున్నాయన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేయడంతో ప్రాణాలు పోతాయని వాహనదారులు గుర్తించడం లేదని అన్నారు. ఇకపై సెల్‌ఫోన్ డ్రైవింగ్‌పై డ్రైవ్‌లు నిర్వహిస్తామని, వాహనదారులకు జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ మోహన్‌బాబు ఆర్ఐ సాంబశివరావు, ఎస్ఐల రవి, సాగర్, వెంకన్న, పాల్గొన్నారు.



'విన్‌ఫీల్డ్'లో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు



ఖమ్మంటౌన్,నవంబరు25(ఆంధ్రజ్యోతి): నగరంలోని విన్‌ఫీల్డ్ హైస్కూల్‌లో సోమవారం గ్రాండ్ పేరెంట్స్‌డే వేడుకలు నిర్వహించారు.1నుంచి5తరగతుల విద్యార్థుల నాయనమ్మ,అమ్మమ్మ, తాతయ్యలు, తల్లిదండ్రులు హాజరయ్యారు. గ్రాండ్ పేరెంట్స్ వల్ల పిల్లలకు కలిగే ప్రయోజనాలను పాఠశాల డైరెక్టర్లు గద్దె పుల్లారావు, పోలవరపు శ్రీకాంత్, మన్నె కిషోర్‌కుమార్ వివరించారు. గ్రాండ్‌పేరెంట్స్‌కు విద్యార్థులు పాదాభివందనం చేశారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	46 రూ.
వంకాయ	38
గుత్తి వంకాయ	50
బీరకాయ	58
పచ్చిమిర్చి	28
కాకరకాయ	34
బెండకాయ	24
పొట్లకాయ	38
దోసకాయ	38-58
చిక్కుడు	74
నాటుచిక్కుడు	100
గోరుచిక్కుడు	48
క్యాబేజీ	34
దొండ	40-48
సొరకాయ	20
క్యారెట్	68
క్యాప్సికం	58
ఆలుగడ్డ	38
ఉల్లిగడ్డ	60-70
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	175
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

కొనసాగుతున్న మహారుద్రయాగం



ఖమ్మంసాంస్కృతికం, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంలో నిర్వహిస్తున్న సహస్రచండీ సహిత మహారుద్రయాగం సోమవారం రెండోరోజు కొనసాగింది. హోమాలు, యాగాలతో యాగశాల ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణంఏర్పడింది. లోకకళ్యాణాన్ని కాంక్షిస్తూ ఖమ్మంలో మొట్టమొదటగా చండీ సహిత మహారుద్రయాగాలకు సంకల్పించారు. ఆదివారం రాత్రి బగళ, ప్రత్యంగిర, వారాహి, శ్రీవిద్య విశేష హోమాలతో హోమక్రతువును ముగించారు. అనంతరం సోమవారం కార్యక్రమాల్లో భాగంగా.. ఉదయాన్నేగోపూజ,చండీహవనం,పార్థివ లింగార్చన, వేదపారాయణంతో రుత్వికులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాయంత్ర కార్యమాల్లో భాగంగా రుద్ర హోమం, 365 దీపాలతో జ్యోతిర్లింగార్చన, సహస్రచండీ చండీ హోమం, రుద్ర హోమం, మహాలింగార్చన నిర్వహించారు.

అభివృద్ధి పనుల్లో రాజకీయ వివక్ష లేదు



పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి తుమ్మల

- దశలవారీగా ఖమ్మం నగర సమస్యల పరిష్కారం
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఖానాపురంహవేలి ఆరోగ్య కేంద్రానికి శంకుస్థాపన

ఖమ్మం, నవంబరు 25(ఆంధ్రజ్యోతిప్రతినిధి): అభివృద్ధి పనుల కేటాయింపుల్లో రాజకీయ వివక్ష ఉండదని, ఎక్కడ సమస్యల ఉంటే అక్కడ పనులు చేస్తామని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం ఖానాపురంహవేలిలో రూ.కోటి43లక్షల అంచనాతో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనానికి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ఏప్రాంతంలో చట్టసభల్లో, స్థానికసంస్థల్లో కానీ ప్రజాప్రతినిధులు ఎవరున్నా రాజకీయ వివక్ష లేకుండా అభివృద్ధి పనులు మంజూరు చేసి పనులు చేపడుతున్నామని తెలిపారు. అభివృద్ధి పనులు ఒకేసారి జరపడం సాధ్యంకాదని, ప్రాధాన్యత క్రమంగా నిధులు కేటాయించి పనులు పూర్తి చేస్తామని వివరించారు. ఖమ్మం నగరంలో అనుకున్న విధంగా అభివృద్ధి పనులను ప్రణాళికబద్ధంగా పూర్తి చేస్తామని, నగర ప్రధాన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని , మొక్కలు నాటే కార్యక్రమం అధికంగా చేపట్టాలని, పట్టణాన్ని పచ్చదనంతో తీర్చిదిద్దాలని సూచించారు. మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ 4వడివిజన్‌లో ఆరోగ్య కేంద్రంతో ఈప్రాంత ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. అనేకమంది గ్రానైట్ పరిశ్రమల కార్మికులకు ఈ కేంద్రం ద్వారా వైద్య చికిత్సలు పొందే అవకాశం వస్తుందన్నారు. మంత్రి తుమ్మల ఆధ్వర్యంలో రాబోయే నాలుగేళ్ల ఖమ్మం నగరం మరింతగా అభివృద్ధి చెందుతుందన్నారు. అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ఖానాపురంలోనిఅర్బన్ ప్రాథమికఆరోగ్య కేంద్రం పనులు సత్వరం చేపట్టాలని,నాణ్యతగా నిర్మించాలనిసూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కార్పొరేటర్లు, కమర్తపు మురళి, జ్యోతిరెడ్డి, వైద్యారోగ్యశాఖ అధికారి బి.కళావతి బాయి, మునిసిపల్ ఈఈలు కృపాలాల్, రంజిత్ పాల్గొని ప్రసంగించారు.

'బ్లూమింగ్ మైండ్స్'కు ఉత్తమ పాఠశాల అవార్డు

ఖమ్మంఖానాపురంహవేలి, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీ 76వ దినోత్సవ సందర్భంగా తెలుగురాష్ట్రాలలో ప్రకటించిన వివిధ విభాగాల్లో రాష్ట్రంలోనే ఉత్తమ విద్యాసంస్థగా ఖమ్మంజిల్లాలోగల బ్లూమింగ్ మైండ్స్ సెంట్రల్‌స్కూల్, జూనియర్ కళాశాల కైవసం చేసుకుంది. హైదరాబాద్‌లోని మిలటరీ గ్రౌండ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ రెండు తెలుగు రాష్ట్రాల డిప్యూటీ డైరెక్టరేట్ కమాండర్ వి.ఎం.రెడ్డి అవార్డును అందించి అభినందించారు. ఈ సందర్భంగా సోమవారం ఏర్పాటుచేసిన అభినందన సభలో పాఠశాల కరస్పాండెంట్ పి.అశోక్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్‌సీసీ, వ్యాయామ ఉపాధ్యాయులు చూపిస్తున్న చొరవ, విద్యార్థుల ప్రతిభ వల్లనే అంతటి ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకున్నామన్నారు. ఇది పాఠశాలకు గౌరవంగా భావిస్తున్నామన్నారు.



సినిమా

నగరంలో చిత్రాలు..

వినోద:	లక్కీభాస్కర్
శ్రీనివాస:	అమరన్
సాయిరాం:	మెకానిక్‌రాకీ
కేపీఎస్:	కంగువ
తిరుమల: దేవకీనందన వాసుదేవ	
సినీ గెలాక్సీ:	జీబ్రా

ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్లు శ్రీజ, శ్రీనివాస్‌రెడ్డి

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి అర్జీలను పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెకర్లు పి.శ్రీజ, పి.శ్రీనివాస్‌రెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వారు ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చి గ్రీవెన్స్‌లో ప్రజలు అందించిన దరఖాస్తులను ఆయా శాఖల అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులపై వారు సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో ఎం.రాజేశ్వరి, కలెక్టరేట్ పరిపాలన అధికారిణి అరుణ, జిల్లా అధికారులు ల్యాండ్‌సర్వే ఏడీ శ్రీనివాసులు, కారుమంచి శ్రీనివాసు, డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతీబాయి తదితరులు పాల్గొన్నారు.

● ఖమ్మం అర్బన్ మండలం రామన్నపేట గ్రామానికి చెందిన కూచిపూడి సన తన ఇల్లు వరదల్లో కొట్టుకొని పోయిందని,నేటికీ సహాయం రాలేదని విజ్ఞప్తి చేసింది.

● ఖమ్మం అర్బన్ మండలం కైకొండాయిగూడేనికి చెందిన కట్ల రమాదేవి తనకు ప్రభుత్వ ఆసుపత్రిలో మూడవ కాన్పు జరిగిందని, పుట్టినబాబుకు బర్త్ సర్టిఫికెట్ జారీ చేయడం లేదని, దీనికోసంరోజులుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని వివరించింది.

● వేంసూరు మండలం కొత్త చౌడవరం గ్రామానికి చెందిన జి.శ్రీను తనకు దివ్యాంగుల కోటాలో ఉద్యోగం ఇప్పించాలని కోరాడు.

● కొణిజర్ల మండల కేంద్రానికి చెందిన కొర్ల పాటి ధనమ్మ తాను నిరుపేదనని తనకు ఇంటి స్థలం ఇప్పించాలని కోరింది.



అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు

ముందస్తు సమాచారం లేకుండానే ప్రజావాణి మూత

ఇన్‌వార్డు ఉద్యోగికి వినతులు అందించిన ఫిర్యాదుదారులు



ఖమ్మంసంక్షేమవిభాగం: సోమవారం ఎప్పుడు వస్తుందా... తమ సమస్యలు ఉన్నతాధికారులకు చెప్పుకునేందుకు ప్రజావాణికి వెళ్లాలని ఫిర్యాదుదారులు ఎదురు చూస్తుంటారు. కానీ ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో ముందస్తు సమాచారం లేకుండానే ప్రజావాణి మూతపడింది. ఒక వైపు సమగ్ర సర్వే ఇతర పనులు ఉన్నాయని సోమవారం అధికారులు ప్రజావాణి కార్యక్రమం చేపట్టలేదు. కనీసం వినతులు ఆన్‌లైన్ నమోదు జరపలేదు. ఆన్‌లైన్ నమోదు సెంటర్ వద్ద ఓ ఇన్‌వార్డు ఉద్యోగిని ఉంచి ఫిర్యాదుదారుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు.

ఎస్సీ కమ్యూనిటీ భవనాలకు కమ్యూనిస్టు భవనాలుగా నామకరణం

- రెవెన్యూ విభాగం తప్పదాలతో చిక్కులు



ఎస్సీ కమ్యూనిటీ హాల్ పేరుతో రశీదు,ఎస్సీ కమ్యూనిస్టు హాల్ పేరుతో ఆన్‌లైన్‌లో పేరు

ఖమ్మంసంక్షేమవిభాగం, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థలోని రెవెన్యూ విభాగం ఆన్‌లైన్ నిర్లక్ష్యపు తీరు నగర ప్రజలకు ఇక్కట్లు ఇక్కట్లు తెప్పిస్తున్నాయి. దీంతో నిత్యం పదుల సంఖ్యలో నివాసాలు, కమర్షియల్ వ్యాపారులు కేఎంసీకి క్యూ కడుతున్నారు. ఇదిలా ఉంటే రెవెన్యూ విభాగం నిర్లక్ష్యంతో ఎస్సీ కమ్యూనిటీ భవనాలు కాస్తా ఎస్సీ కమ్యూనిస్టు భవనాలుగా నగర పాలక సంస్థ అధికారులు నామకరణం చేస్తున్నారు. ఖమ్మం నగరంలోని జహీరపురాలో ఇంటి నెంబర్ 3-8-81తో ఎస్సీ కమ్యూనిటీ హాల్ కొనసాగుతోంది. ఏటా కేఎంసీకి ట్యాక్స్‌లు సైతం చెల్లిస్తున్నారు. కానీ ఇటీవలనే ఆన్‌లైన్‌లో పేరు చూసిన కమ్యూనిటీ భవన నిర్వాహకులు ఖంగుతిన్నారు. ఎస్సీ కమ్యూనిటీ భవనం కాస్తా ఎస్సీ కమ్యూనిస్టు హాల్‌గా ఆన్‌లైన్‌లో పేరు మార్చి ఉంది. దీంతో నిర్వాహకులు ప్రతిరోజు కేఎంసీలోని రెవెన్యూ విభాగం చుట్టూ ప్రదీక్షణలు చేస్తున్నారు. పారిశుధ్య విభాగంలో పనిచేసేందుకు ఉద్యోగాలు పొందిన వారు, కార్పొరేటర్లు, నాయకులతో సిపారసుతో ఏదో కంప్యూటర్ సెంటర్ నుంచి ధ్రువపత్రాలను పొంది ఆన్‌లైన్ ఉద్యోగాలు చేస్తూ ఉండటమే ఇటువంటి వరస తప్పదాలకు కారణమని తెలుస్తోంది.

టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులుగా విజయ్, పద్మ

ఖమ్మంటౌన్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర కార్యదర్శులుగా ఎస్, విజయ్, వై.పద్మను నియమించారు. హైదరాబాద్‌లో సోమవారం జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్, రాష్ట్ర కౌన్సిలర్‌గా పని చేస్తున్న పద్మకు రాష్ట్ర కార్యదర్శులుగా బాధ్యతలు అప్పగించినట్లు జిల్లా అధ్యక్షుడు ఏపీ. నాగేశ్వరరావు తెలిపారు.

పేరు ఎలా వచ్చిందంటే?

చెరువు బజార్



ఖమ్మంసాంస్కృతికం, నవంబరు24 (ఆంధ్రజ్యోతి): స్థానిక లకారం చెరువు కారణంగా ఈప్రాంతానికి చెరువు బజార్ అన్నపేరు వచ్చింది. జమ్మిబండ, పాకబండ బజార్‌ల మధ్య ప్రాంతంగా ఈ వీధి ఉంది.. నగర తూర్పు దిక్కాలకుడు దాసాంజనేయస్వామి దేవాలయం ముందు, వెనుక, ఇరుపక్కలా చెరువు బజార్ విస్తరించి ఉంది. పురాతన కాలంలో చెరువు ప్రజల జీవితాల్లో ఎంతటి ప్రాధాన్యతను కలిగిఉందో ఈ ప్రాంతం వివరిస్తుంది. గతంలో లకారం చెరువు ఖమ్మం నగర సాగు, తాగునీటి అవసరాలు తీర్చటంతోపాటు, రజకులకు చాకిరేవుగా ఉపయోగపడింది. నగర వ్యాప్తంగా రజకులు ఇక్కడే దుస్తులను శుభ్రపరిచేవారు. అప్పట్లో ఇంటింటి నుంచి విడుపు దుస్తులు సేకరించి ఆమూటలను గాడిదల మీద వేసి తీసుకొచ్చేవారు. చాకిరేవులో పొయ్యిలు ఏర్పాటు చేసి దుస్తులను ఉడికించటం, శుభ్రంచేయటం, నీలి మందు పెట్టి ఆరేయటం వంటివి చేసేవారు. చెరువు కింద ఆయకట్టు పొలాల రైతులు సైతం ఈ దారిన రాక పోకలు సాగించే వారు. చనిపోయిన వారిని సైతం చెరువు కట్ట వెంబడే ఖననం చేసేవారు.

రేషన్‌డీలర్ల నగర అధ్యక్షుడిగా ఇబ్రహీం



ఖమ్మంకలెక్టరేట్, నవంబరు25 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర రేషన్‌డీలర్ల సంఘం అధ్యక్షునిగా షేక్ ఇబ్రహీం ఎన్నికయ్యారు. మోతీనగర్‌లో ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు భానోత్ వెంకన్న అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. నూతన కమిటీని ఎన్నుకున్నారు. నగర అధ్యక్షుడిగా షేక్ ఇబ్రహీం, ప్రధాన కార్యదర్శి సిద్ధంశెట్టి శేషగిరిరావు, కోశాధికారిగా చెన్నూరు ఉపేంద్రరావు,గౌరవ అధ్యక్షుడిగా షేక్ జానీమియా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బాణోత్ వెంకన్న వర్కింగ్ ప్రెసిడెంట్ దొండా దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై హింసను అరికట్టేందుకు కఠిన చట్టాలు తేవాలి

ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి బుగ్గవీటి సరళ





మాట్లాడుతున్న బుగ్గవీటి సరళ, హాజరైన విద్యార్థినులు

ఖమ్మంటౌన్,నవంబరు25(ఆంధ్రజ్యోతి): మహిళలపై జరిగే హింసను అరికట్టేందుకు కఠిన చట్టాలు తెచ్చి వాటిని అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి బుగ్గవీటి సరళ, జిల్లా కార్యదర్శి బండి పద్మ డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని ప్రియదర్శిని కళాశాలలో ఐద్వా ఆధ్వర్యంలో మహిళలపై హింస వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. రోజూ ఏదో ఇక రూపంలో మహిళలపై హింస, అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయన్నారు. పాలకులు మారినా మహిళలపై జరిగే హింసను అరికట్టలేకపోతున్నారన్నారు. మత్తుపదార్థాలను బ్యాన్ చేయాలన్నారు. మహిళాసాధికారత కోసం, మహిళారక్షణ కోసం మహిళలు ఐక్యంగా ఉండి పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు మెహరున్నీసా, నేతలు పెంట్యాల సుమతి. బీ. పద్మ, ఉష పాల్గొన్నారు.

లకారం రూపురేఖలు మారాలి

- మేయర్ పునుకొల్లు నీరజ



ట్యాంక్‌బండ్‌పై పర్యటిస్తున్న మేయర్ నీరజ

ఖమ్మంసంక్షేమవిభాగం,నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ప్రజల్ని ఆకర్షించేలా లకారం ట్యాంక్ బండ్, ఖానాపురం వాక్‌వేలు ఎప్పటికప్పుడు ఆధునీకిరిస్తూ ఉండాలని మేయర్ పునుకొల్లు నీరజ ఆదేశించారు. సోమవారం మేయర్ పునుకొల్లు నీరజ ఖానాపురం వాక్‌వే, లకారం ట్యాంక్ బండ్‌లను తనిఖీ చేశారు. జిమ్‌లు మరమతులు చేయించాలని, మరుగుదొడ్లు పరిశుభ్రం చేసి ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. బ్యాటరీ వాహనాలకు మరమ్మతులు చేయించి ప్రజలకు వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. అందమైన మొక్కలు నాటాలని, వేపుగా పెరిగిన మొక్కలకు నిర్ణీత సమయంలో ట్రిమ్మింగ్ చేయాలని సూచించారు. గతంలో కంటే నగరంలో పార్కుల నిర్వాహణ పెరిగిందని, మొక్కల సంరక్షణకు ఇంకా చర్యలు తీసుకోవాలని కేఎంసీ ఉద్యాన అధికారి బెల్లం రాధికాకు సూచించారు. ఎన్విరాన్‌మెంట్ ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం అమ్ముకోవాలి

ఖమ్మంరూరల్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని ఏడీఏ సరిత రైతులకు సూచించారు. మండలంలోని ముత్తగూడెం గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆమె పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. రూరల్ మండలంలో మొత్తం 8 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. 7 కేంద్రాలు సన్నాలకు, 1 కేంద్రం దొడ్డు రకాలకు కేటాయించామన్నారు. రైతులు వరిపంట కొయ్యలను కాల్చవద్దని ఏడీఏ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో ఉమా నగేస్ తదితరులు పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంకు అంబులెన్స్ విరాళం

ఖమ్మంకలెక్టరేట్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్పొరేట్ సోషల్ రిస్పాన్సిబిలిటీలో భాగంగా ప్రభుత్వ ఆసుపత్రికి అంబులెన్సును విరాళంగా అందజేసింది. సోమవారం కలెక్టర్ ముజమిల్ ఖాన్ చేతుల మీదుగా అందజేశారు. కలెక్టర్ అంబులెన్సుని తానే స్వయంగా డ్రైవింగ్ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, ఆస్పత్రి సూపరిన్‌టెండెంట్ డాక్టర్ ఎల్ కిరణ్‌కుమార్, యూనియన్ బ్యాంక్ ఖమ్మం రీజినల్ హెడ్, డిప్యూటీ జనరల్ మేనేజర్ హన్మంతరెడ్డి, బ్యాంక్ ఏజీఎమ్ సర్వేశ్, ఏజీఎమ్ సుధాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవి ఆశ్రమ పాఠశాల పరిశీలన

కామేపల్లి,నవంబరు25(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాతలింగాల కేజీబీవి ఆశ్రమ పాఠశాలను మండల ప్రత్యేకాధికారి జిల్లా ఉద్యానవన శాఖడీడీ ఎంవి మదుసుధన్‌రావు సోమవారం పరిశీలించారు. విద్యార్థులకు అందించే భోజన వివరాలను తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని అడిగారు. నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జీ. వెంకట్, సీఆర్‌పీ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

27న షిరిడీ సాయిబాబా భక్తుల సమావేశం

ఖమ్మంసాంస్కృతికం,నవంబరు25(ఆంధ్రజ్యోతి): ఈనెల 27న హైదరాబాద్ నాగోల్‌లో దేవకి కన్వెన్షన్‌లో షిరిడీ సాయిబాబా భక్త ఐక్యవేదిక సమావేశం నిర్వహిస్తున్నట్లు గాంధీచౌక్ సాయిబాబా దేవాలయ చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. షిరిడీ సాయిబాబాపై సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలను తిప్పికొట్టేందుకు ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణలోని అన్ని షిరిడీ సాయిబాబా దేవాలయాల నిర్వాహకుల సమావేశానికి సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ షిరిడీ సీఈవో గోరక్ష గాడిల్కర్ ముఖ్య అతిధిగా హాజరవుతారన్నారు. తెలంగాణ వ్యాప్తంగా షిరిడీ సాయిబాబా మందిరాల చైర్మన్లు, సెక్రటరీలు, ట్రెజరర్లు హాజరు కావాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

కామేపల్లి,నవంబరు25(ఆంధ్రజ్యోతి): కామేపల్లి మండలం తాళ్లగూడెం గ్రామానికి చెందిన బొల్లు రామారావు అనారోగ్యంతో ఓప్రైవేటు ఆసుపత్రిలో వైద్య చికిత్సలు పొందారు. సీఎం సహాయనిధికి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సిఫారసుతో దరఖాస్తు చేసుకున్నారు. మంజూరైన రూ.30వేలు చెక్కును భట్టి విక్రమార్క వ్యక్తిగత సహాయకుడు శ్రీనివాస్ అందజేశాడు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యులు నల్లమోతు లక్ష్మయ్య, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, బాబురావు పాల్గొన్నారు.

టీపీఎస్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఫజల్



కామేపల్లి,నవంబరు25(ఆంధ్రజ్యోతి): తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ అసోసియేషన్(టీపీఎస్ఏ) మరియు పంచాయతీరాజ్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్రఉపాధ్యక్షుడిగా కామేపల్లి మండలం రుక్కితండ పంచాయతీ కార్యదర్శి మహ్మద్ ఫజల్ ఎన్నికయ్యారు. ఆదివారం ఖమ్మంలో ఈ ఎన్నిక జరిగింది. ప్రస్తుతం కామేపల్లి మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా పని చేస్తున్నాడు.

మాలల సింహగర్జన సభను జయదం చేయండి

ఖమ్మంచర్చికాంపౌండ్,నవంబరు25(ఆంధ్రజ్యోతి): డిసెంబరు1న సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జరిగే మాలల సింహగర్జన బహిరంగసభను జయప్రదం చేయాలని ఎస్సీవర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర కో చైర్మన్ గోపోజు రమేష్ అన్నారు. సోమవారం నగరంలోని చర్చికాంపౌండ్ వద్దగల కమ్యూనిటీహాల్‌లో ఎస్సీవర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సమావేశం జరిగింది. సభ పోస్టర్లను ఆవిష్కరించారు. ప్రతిగ్రామం నుంచి మాలలు కదం తొక్కి సభను జయప్రదం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మంజిల్లా కన్వీనర్ గుంతేటి వీరభద్రం, డాక్టర్ ఎంఎఫ్ గోపీనాథ్, గులగట్టు యల్లయ్య, లింగాల రవికుమార్, మోటపోతుల బాబురావు, దామల్ల సత్యనారాయణ, పేరం మల్లయ్య, ముడుసుజాకబ్, దార సంజీవరావు, కాశయ్య పాల్గొన్నారు.

ఘనంగా వీరభద్ర స్వామి అర్చన



వీరభద్రస్వామి పూజల్లో పాల్గొన్న రంగా వంశస్తులు

ఖమ్మంసాంస్కృతికం,నవంబరు25(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం సందర్భంగా తమ ఇలవేలుపు వీరభద్రస్వామిని రంగా వంశస్తులు ఘనంగా పూజించారు. ఖమ్మం నగరంలోని రిక్కాబజార్ ప్రాంతానికి చెందిన ఆర్యవైశ్యులైన రంగా ఇంటిపేరిట వాళ్లు ఏటా కార్తీక మాసం చివరి సోమవారం తమ ఇంటి దైవం వీరభద్ర స్వామికి సామూహికంగా అర్చన చేస్తారు. సంప్రదాయంలో భాగంగా సోమవారం పెవిలియన్ గ్రౌండ్ ఎదురుగా ఆర్ అండ్ బీ అతిథిగృహంలో అంతర్భాగంగా ఉన్న శ్రీ భద్రకాళిసమేత వీరభద్ర స్వామి దేవాలయానికి చేరుకున్నారు. యాభై కుటుంబాలకు పైగా రంగా వంశీకులతో పాటు వారి సోదరీమణులు, బంధుమిత్రులు పూజా కార్యక్రమాలను తిలకించేందుకు హాజరయ్యారు. పూజలో పాల్గొనేందుకు ఖమ్మం నగర వ్యాప్తంగానే కాక పరిసర ప్రాంతాలు, ఇతర రాష్ట్రాల్లో ఉన్న వారు ఖమ్మం వచ్చారు.అనంతరం నగర సంకీర్తన జరిపారు.

నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు: ఏడీఏ

బోనకల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తనాలు, ఎరువులను మాత్రమే రైతులకు విక్రయించాలని, నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఏడీఏ స్వర్ణ విజయచంద్ర డీలర్లను హెచ్చరించారు. బోనకల్ రైతువేదిక కార్యాలయంలో సోమవారం నిర్వహించిన బోనకల్, చింతకాని మండలాల డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. దుకాణాలల్లో స్టాకు బోర్డులను ప్రదర్శించాలని సూచించారు. స్టాక్ రిజిస్టర్, బిల్ పుస్తకాలను అప్‌డేట్‌గా ఉంచుకోవాలన్నారు. ఎరువులు పీవోఎస్ మిషన్ ద్వార మాత్రమే విక్రయించాలని ఆదేశించారు. లైసెన్సును ప్రదర్శించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవోలు వినయ్ కుమార్, మానస, ఏఈవోలు నాగసాయి, హరికృష్ణ, డీలర్లు పాల్గొన్నారు.



దేవిశెట్టి ప్రవళిక

ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్‌లో ప్రవళికకు ఉద్యోగం

మధిరరూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం జిలుగుమాడు గ్రామానికి చెందిన దేవిశెట్టి ప్రవళిక ప్రభుత్వ ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగం సాధించింది. ఇటీవల విడుదలైన గ్రూపు-4 ఫలితాల్లో ఓపెన్ కేటగిరిలో ఉత్తీర్ణత సాధించడంతో ఆమెకు ఈ ఉద్యోగం లభించింది. ప్రవళిక పదోతరగతి నుంచే మంచి ప్రతిభను కనపర్చి ఐఐటీ బాసరలో సీటు సాధించి సీఈసీలో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించింది. గ్రూపు-4లో ఉద్యోగం సాధించిన ప్రవళ్లికను కుటుంబసభ్యులు, గ్రామస్థులు అభినందించారు.

మధిరకు హంగులు

- శివాలయం రోడ్డు విస్తరణకు మార్గం సుగమం
- ఆర్అండ్‌బీకి బదలాయించిన మునిసిపాలిటి
- రోడ్డు, బ్రిడ్జి నిర్మాణం కోసం 24.5 కోట్లతో ప్రతిపాదనలు
- నెరవేరనున్న భట్టి విక్రమార్క హామీ

మధిరటౌన్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మధిరలోని అంబేద్కర్ సెంటర్ నుంచి శివాలయం వరకు రోడ్డు విస్తరణతో పాటు వైరా నదిపై బ్రిడ్జి నిర్మించాలన్న మధిర ప్రజల తో పాటు మడుపల్లి వాసుల కల సాకారం కానుంది. 2013వ సంవత్సరంలో మేజర్ పంచాయతీగా ఉన్న ఉన్న మధిరను మునిసిపాలిటీగా మార్చే క్రమంలో గ్రామ పంచాయతీగా ఉన్న మడుపల్లిని మునిసిపాలిటీలో విలీనం చేశారు. ఆ సమయంలో మధిరకు మడుపల్లికి మధ్య వైరా నదిపై బ్రిడ్జి నిర్మిస్తానని డిప్యూటీ స్పీకర్ హోదాలో భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. తరువాత రాష్ట్ర విభజన జరగటంతో ఆ తరువాత టీఆర్ఎస్ ప్రభుత్వ రావటంతో భట్టీ హామీ నెరవేరలేదు.

కాంగ్రెస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడంతో స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వైరా నదిపై బ్రిడ్జి నిర్మాణం తో పాటు అంబేద్కర్ సెంటర్ నుంచి శివాలయం వరకు రోడ్డు విస్తరణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. రోడ్డు విస్తరణ ప్రాంతం విలువైనది కావడంతో స్థానికులను ఒప్పించాల్సిన బాధ్యత తీసుకోవాలని ఇప్పటికే అఖిలపక్ష నాయకులను కోరారు.

రోడ్డు విస్తరణ ఎన్ని అడుగులో తేలకపోవడంతో ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. మునిసిపాలిటి కింద ఉన్న రోడ్డును ఆర్అండ్‌బీకి బదలాయిస్తూ మునిసిపాలిటి తీర్మాణం చేసింది. ఆర్అండ్‌బీ రోడ్డుగా జీవో కోసం ఎదురు చూడకుండా డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు 1.5 కి.మీ రోడ్డు విస్తరణతోపాటు బ్రిడ్జి నిర్మాణానికి రూ.24.5 కోట్లతో ఆర్అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. దీనిపై ఆర్అండ్‌బీ జేఈ రాంబాబు వివరణ కోరగా రోడ్డు విస్తరణతో పాటు, బ్రిడ్జి నిర్మాణం కోసం అంచనాలు సిద్ధం చేశామన్నారు. రోడ్డును తమ శాఖకు అప్పగిస్తూ జీవోరాగానే తరువాత కార్యాచరణను వెంటనే చేపడతామని తెలిపారు.



రోడ్డు విస్తరణ చేపట్టవలసిన కళామందిరం రోడ్డు

రోడ్డు విస్తరణకు సహకరిస్తాం
మక్కెన నాగేశ్వరరావు, భవన యజమాని



రోడ్డు విస్తరణ వలన విలువైన ఆస్తిని కోల్పోయినప్పటికీ మిగిలిన ఆస్తికి ఇంకా విలువ పెరుగుతుంది. రోడ్డు ఇరుకుగా ఉండటం వలన ఇక్కడ నిత్యం ట్రాఫిక్‌జాం అవుతోంది. కావునా విస్తరణకు అభివృద్ధికి నేను సహకరిస్తా. మిగిలిన యజమానులు కూడా ముందుకు రావాలి.

నెరవేరనున్న ప్రజల కల
వి. శ్రీనివాస రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్



మధిర మునిసిపాలిటీలో మడుపల్లి గ్రామ పంచాయతీని విలీనం చేసేటప్పుడు ఆనాడు డిప్యూటీ స్పీకర్ హోదాలో భట్టి విక్రమార్క వంతెన నిర్మాణానికి హామీఇచ్చారు. దానితోనే మడుపల్లి ప్రజలు విలీనానికి అంగీకరించారు. ఆ తరువాత వచ్చిన ప్రభుత్వం వైరా నదిపై బ్రిడ్జి నిర్మాణం హామీని విస్మరించింది. ఇప్పుడు అంచనాలు సిద్ధం చేయడం సంతోషంగా ఉంది.

శానిటరీ కిట్ల పంపిణీ



బాలికలకు శానిటరీ కిట్లు అందిస్తున్న తోపుడు బండి అధినేత్రి ఉషా

కల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) కల్లూరులో తోపుడుబండి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం పలు పాఠశాలల బాలికలకు శానిటరీ కిట్లను పంపిణీ చేశారు. తోపుడుబండి అధినేత్రి దయాల ఉష వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఉషా మాట్లాడుతూ ప్రభుత్వ బాలికల, ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతిలో 10/ 10 సాధించిన విద్యార్థులకు రూ. 5 వేలు పారితోషకం అందిస్తామని ప్రకటించారు. తోపుడుబండి తాత అయిన కీర్తిశేషులు సాధిక్‌కు మంచి పేరు తేవాలని విద్యార్థులను కోరారు. సాధిక్ సేవలను ఆదర్శంగా తీసుకుని సేవలు అందించాలని విద్యార్థులకు హితవు చెప్పారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిధులు ఇవ్వండి

- మంత్రి తుమ్మలను కోరిన సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి



మంత్రి తుమ్మలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి

సత్తుపల్లిరూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావును సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి కోరారు. సోమవారం మంత్రి స్వగ్రామం దమ్మపేట మండలం గండుగులపల్లిలో ఆయణ్ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అభివృద్ధి, సంక్షేమంపై తుమ్మలకు వివరించి పలు అంశాలపై చర్చించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈమేరకు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే రాగమయి కార్తీకమాస చివరి సోమవారం సందర్భంగా కాకర్లపల్లి, బేతుపల్లిలోని శివాలయాలలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అటవీశాఖ స్థలాన్ని పరిశీలించిన సీసీఎఫ్

- సమావేశ మందిరం నిర్మించాలని నిర్ణయం



కల్లూరులో అటవీశాఖ స్థలాన్ని పరిశీలిస్తున్న సీసీఎఫ్ భీమానాయక్

కల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) కల్లూరు మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో అటవీశాఖకు కేటాయించిన ప్రభుత్వ స్థలాన్ని సోమవారం చీఫ్ కన్‌జర్వేటర్ ఆఫ్ ఫారెస్టు భీమానాయక్, జిల్లా అటవీశాఖ అధికారి సిద్ధార్థ విక్రమ్‌సింగ్ సందర్శించి పరిశీలించారు. ఈ స్థలంలోనే అటవీశాఖ తరుపున సమావేశ మందిరం నిర్మించాలని నిర్ణయించారు. దీంతో ఈ భవనం నిర్మాణానికి ఇంజనీరింగ్ ప్లానింగ్ రూపొందించాలని సత్తుపల్లి డివిజన్ ఎఫ్‌డిఓ, తల్లాడ సబ్ డివిజన్ ఎఫ్ఆర్వో మంజుల, ఉమాను ఆదేశించారు. దీంతో నిధులు మంజూరు కాగానే త్వరలో ఇక్కడ భవనం నిర్మాణ పనులు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని స్థానిక అటవీశాఖ అధికారులు సిసిఎఫ్ ఆదేశించారు.

ప్రజా సంక్షేమం దిశగా తెలంగాణ

- వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం ప్రజాసంక్షేమ దిశగా ముందుకు సాగుతోందని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. మండలంలోని స్నానాల లక్ష్మీపురంలో సోమవారం 22మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు, కొంతమంది బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో సన్నధ్యానం రైతులకు రూ.500బోనస్ ఇస్తూ రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్‌గాంధీ ఇచ్చిన హామీ మేరకు రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రైతుల అభివృద్ధి, సంక్షేమం కోసం పనిచేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, తహసీల్దార్ కేవీ శ్రీనివాసరావు, ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ, ఏవో మయాన్ మంజూఖాన్, టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు, వైరా మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, వైరా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ దొడ్డా పుల్లయ్య, మాజీ ఉపసర్పంచ్ మల్లు రామకృష్ణ, ఏఎంసీ మాజీ చైర్మన్ బీడీకే రత్నం, నాయకులు మచ్చా బుజ్జీ, యడ్లపల్లి వీరయ్యచౌదరి, పమ్మి అశోక్, బొళ్ల గంగారావు, పొట్టపల్లి నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, దర్శి చెన్నారావు, చింతనిప్పు మాధవరావు, కట్ల సంతోష్, శీలం నాగిరెడ్డి, సురేందర్‌రెడ్డి, మట్టూరి నాగేశ్వరరావు, కృష్ణారావు, జవ్వాజి నాగరాజు, సత్తెనపల్లి నర్సింహారావు, నర్వనేని గోపాలరావు, తోటకూర నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సర్వర్ డౌన్.. ఎంట్రీ ఎలా?

- కుటుంబాల వివరాల నమోదులో జాప్యం
- వసతులు అంతంత మాత్రమే
- అవస్థలు పడుతున్న డేటా ఎంట్రీ బృందాలు

కల్లూరు, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రకియకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన డేటా ఎంట్రీ సర్వర్ డౌన్‌తో రెండు రోజుల నుంచి ముందుకు సాగడం లేదు. డేటా ఎంట్రీ చేసే కేంద్రాల్లో జిల్లా అధికార యంత్రాంగం సరియైన వసతి సౌకర్యాలు కల్పించకపోవటంతో మహిళ అపరేటర్లు, ఎస్వోలు, ఎన్యుమారేటర్ల బృందాలు అవస్థలు పడుతున్నారు. కల్లూరు కేంద్రంలో సుమారు 60మందికి పైగా అపరేటర్లు పనిచేస్తున్నారు. కేంద్రం ప్రాంగణం ఇరుకుగా ఉండటంతో ఇబ్బందికరంగా మారింది. ఉదయం ఎనిమిది నుంచి రాత్రి పది గంటల వరకు పనిచేసే డేటా ఎంట్రీ అపరేటర్లకు కనీస భోజన వసతి సౌకర్యం కూడా కల్పించలేదు.

కల్లూరు మండలంలో 23,600 కుటుంబాలు ఉండగా అందుకు గాను 100 మంది ఆపరేటర్లు పనిచేయాల్సి ఉండగా అపరేటర్ల కొరత ఏర్పడింది. ఇక్కడ కేవలం 60 మందికి పైగా అపరేటర్లు ఈ డేటా ఎంట్రీ ప్రక్రియలో పనిచేస్తున్నారు. మండల స్థాయిలో ప్రభుత్వ అధికారులు వారి సొంత శాఖల విధులతోనే కాక అదనంగా ఈ డేటా ఎంట్రీ సర్వేతో నానా అగచాట్లు పడాల్సి వస్తుందని వాపోతున్నారు. ఇలా సర్వర్ డౌన్ కారణంగా రాత్రి పూట సమయాల్లో కూడా 10 గంటలకు పైగా పనిచేయాల్సి వస్తుందని తెలిసింది. తహసీల్దార్, ఎంపీడీవోలు పర్యవేక్షిస్తున్నా అంతరాయం ఆగడం లేదు. కొత్తగా డేటా ఎంట్రీ కోసం ముందుకు వచ్చిన అపరేటర్లకు లాగిన్ కూడా అలస్యం అవుతోంది. పగలులలలలలలలలు లాగిన్ అనుసంధానం కావాలంటే గంటల తరబడి సమయం పడుతోంది.



కల్లూరు మండల పరిషత్ కార్యాయలంలో డేటా ఎంట్రీ చేస్తున్న సర్వే బృందాలు



ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్రీజ

సర్వే డేటా ఆన్‌లైన్ సమర్థవంతంగా నిర్వహించాలి

- అడిషనల్ కలెక్టర్ శ్రీజ

బోనకల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుల గణన సర్వే డేటా ఆన్‌లైన్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని అడిషనల్ కలెక్టర్ శ్రీజ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో కొనసాగుతున్న సర్వే డేటా ఆన్‌లైన్ ప్రక్రియను సోమవారం సాయంత్రం ఆమె పరిశీలించారు. ఎటువంటి తప్పులు లేకుండా డేటాను పకడ్బందీగా కంప్యూటరీకరణ చేయాలని సూచించారు. ఈ నెల 30వ తేది నాటికి సర్వే ఆన్‌లైన్ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంట తహసీల్దార్ పున్నం చందర్, ఎంపీడీవో ఆర్. రమాదేవి ఉన్నారు.

కొనుగోలు కేంద్రానికి భారీగా ధాన్యం రాక



ధాన్యం కొనుగోలు చేస్తున్న ఐకేపీ సిబ్బంది

కారేపల్లి, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కారేపల్లి ఐకేపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలుకేంద్రంలో రైతులు భారీగా ధాన్యం విక్రయిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన ధర రూ.2320తో పాటు మద్దతు ధరగా 500 బోనసు ధర ప్రకటిస్తుండటంతో రైతులు పెద్ద మొత్తంలో ఐకేపీ కేంద్రంలో విక్రయిస్తున్నారు. సోమవారం కేంద్రం సీసీ చైతన్య మాట్లాడుతూ ఇప్పటికే 500 క్వింటాళ్ల వడ్లను కొనుగోలు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో మున్ని, సుజాత, సుహాసిని, కృష్ణవేణి, నాగలక్ష్మి పలువురు రైతులు పాల్గొన్నారు.



విఘ్నేశ్వరికి ఆర్థికసాయం అందజేసిన శ్రీనివాస్ తదితరులు

పేద విద్యార్థినికి ఆర్థికసాయం

మధిరరూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మధిర మండలం మాటూరు గ్రామానికి చెందిన పల్లెపాటి విఘ్నేశ్వరి అనే విద్యార్థిని బీటెక్ మూడో సంవత్సరం చదువుతోంది. మూడేళ్ల క్రితం తండ్రి చనిపోయాడు. ఆర్థిక సమస్యలతో బీటెక్ ఫీజుకు డబ్బులు లేక ఇబ్బందులు పడుతోంది. దీంతో స్పందించిన మధిరకు చెందిన చేడే శ్రీనివాస్ మిత్ర బృందం వారు రూ.49వేల ఆర్థికసహాయాన్ని ఈ విద్యార్థినికి ఫోన్‌పే ద్వారా అందించారు. అలాగే మధిరకు చెందిన కుందా కోటేశ్వరరావు కూడా ఈ విద్యార్థినికి ఆరునెలలపాటు హాస్టల్ ఖర్చును భరించేందుకు ముందుకొచ్చారు.

డబుల్ బెడ్‌రూం ఇళ్లకు మరమ్మతులు చేపట్టాలని ఆందోళన

బోనకల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రావినూతల గ్రామంలో గతంలో పంపిణీ చేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు మరమ్మతులు చేపట్టాలని సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్న బోనకల్ రైతువేదిక కార్యాలయం ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. నాసిరకంగా చేపట్టిన నిర్మాణల వలన స్లాబ్ పై పెచ్చులు ఊడి కింద పడుతున్నాయని ప్రజల ప్రాణాలకు ప్రమాదం ఉందని వెంటనే సమస్యను పరిష్కరించాలని వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కిలారు సురేష్, పంతు, గురవయ్య, నరేష్, వీరభద్రం పాల్గొన్నారు.

కార్తీకం కమనీయం..

- సామూహిక సత్యనారాయణ వ్రతాలు
- శివలింగాలకు అభిషేకాలు
- భక్తితో దీపోత్సవాలు

ముదిగొండ/ ఏన్కూరు/ కారేపల్లి/ పెనుబల్లి/ బోనకల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా సోమవారం ముదిగొండ చెన్నకేశవస్వామి ఆలయంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దంపతులు పీటలపై కూర్చొని వ్రతాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని అర్చకులు రొంపిమళ్ల చిన్ననర్సింహచార్యులు, యోగానందం, కిషోర్, సత్యార్థ, యజ్ఞేష్ నిర్వహించారు. ఏన్కూరులోని అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి శివాలయంలో సోమవారం కోటి దీపోత్సవం నిర్వహించారు. దీంతో శివాలయం ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీచైర్మన్ వేముల రమేష్‌బాబు, అర్చకులు మేడూరి కిరణ్‌కుమార్, కిషోర్ కుమార్ పాల్గొన్నారు.

కార్తీమాసం చివరిసోమవారం సందర్భంగా కారేపల్లిమండల కేంద్రంలోని పెద్దమ్మతల్లి ఆలయంలోగల మహాశివలింగానికి భక్తులు అభిషేకాలు నిర్వహించారు. తెల్లవారుజామునుంచి మహిళభక్తులు తరలివచ్చి అమ్మవారికి పూజలు నిర్వహించారు. అనంతరం శివలింగానికి అభిషేకాలు నిర్వహించి ఒత్తులు వెలిగించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు ఆలయ పూజారి మల్లికార్జనశర్మ తీర్థ ప్రసాదాలను అందచేశారు. పెనుబల్లి రామాలయంలో కార్తీకమాసాన్ని పురస్కరించుకొని సోమవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాలకు చెందిన సుమారు 80మంది జంటలు పాల్గొన్నారు. వారికి ఆలయ అర్చకులు శ్రీరంగం శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో వ్రతాలు నిర్వహించారు. దీంతో ఆలయం కోలాహలంగా మారింది. బోనకల్ సాయిబాబా దేవాలయ ప్రాంగణంలో సోమవారం రాత్రి భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో లక్ష దీపోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్తీక మాసం చివర సోమవారం కావడంతో దేవాలయంలో భక్తులు ప్రత్యేక పూజలు జరిపారు. మహిళలు లక్ష దీపోత్సవంలో భాగంగా దీపాలు వెలిగించారు. దీపాల వెలుగులో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.



ముదిగొండలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతం



ఏన్కూరులో మహిళల నృత్యం



మధిరలో సోమవారం జరిగిన ప్రజాపాలన విజయోత్సవాల్లో తెలంగాణ, సంగీత, నాటక అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజాలను సన్మానిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

టిప్పర్ లారీ ఢీకొని వ్యక్తి మృతి

సత్తుపల్లిరూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): టిప్పర్ లారీ ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళ్తున్న గుర్తుతెలియనివ్యక్తి ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలోని బుగ్గపాడు శివారులో చోటుచేసుకుంది. బుగ్గపాడు నుంచి అన్నపురెడ్డిపల్లి వైపునకు ద్విచక్రవాహనంపై ఓ వ్యక్తి వెళ్తుండగా రేగళ్లపాడు వైపునుంచి బుగ్గపాడుకు కంకర లోడుతో టిప్పర్ లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో సదరు వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా మృతుని వివరాలు తెలియరాలేదు.

నేడు కలెక్టరేట్ వద్ద నిరసన

వైరా, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా మంగళవారం కలెక్టర్ కార్యాలయాల వద్ద నిర్వహించే నిరసన కార్యక్రమాలను విజయవంతం చేయాలని రైతు, కార్మిక సదస్సు పిలుపునిచ్చింది. సోమవారం వైరాలోని బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో అఖిల భారత రైతు, కార్మిక సంఘాల సదస్సు జరిగింది. కేంద్రప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేటీకరణ దిశగా నడుపుతుందని ఆక్షేపించింది.